విజయవాడ
సోమవారం,
23 మార్చి 2026
సంపుటి: 12, సంచిక: 81
వెల : 6/- పేజీలు 12

వినాదం
నిఖార్సైన జర్నలిజం



Published From Vijayawada, Visakhpatnam, Tirupati





# అప్పుడు ఐటీ... ఇప్పుడు క్వాంటం

## నాలెడ్జి ఎకానమీని ఊహించే ఐటీకి ప్రోత్సాహం

- ప్రాజెక్టుల నిర్వహణలో పీపీపీలది సక్సెస్ ఫార్ములా
- యువ పారిశ్రామికవేత్తలకు ఏపీ స్వాగతం
- ఈఓ సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్- 2026లో సీఎం చంద్రబాబు నాయుడు

మూడు దశాబ్దాల క్రితం చేసిన విజన్ ఇప్పుడు ప్రతిఫలాలను ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గతంలో అమలు చేసిన ఐటీ, టెక్నాలజీ, విద్యుత్ సంస్కరణలు ఇప్పుడు ప్రయోజనాలను దక్కేందుకు కారణమవుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో ఈవో సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్ 2026, ట్రాన్స్ ఫార్మింగ్ ఏఐ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో ది ఫ్యూచర్ ఆఫ్ ఎవ్రీథింగ్ అనే అంశంపై సీఎం అభిప్రాయాలను పంచుకున్నారు.

హైదరాబాద్, మార్చి 22 (

నాలెడ్జి ఎకానమీదే భవిష్యత్తు అని ఆలోచన చేసి టెక్నాలజీని ప్రోత్సహించి ఐటీని అందిపుచ్చుకున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా ఉన్న అప్పటి ఉమ్మడి ఏపీని పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఆర్థిక సంస్కరణల్ని అందిపుచ్చుకున్నామన్నారు. ఐటీకి ఇచ్చిన ప్రోత్సాహం కారణంగానే బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను వదిలి మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ లోకి అడుగు పెట్టిందన్నారు. ఐఎస్ బీ, జీనోమ్ వ్యాలీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వచ్చాయన్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాల వల్లే ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలూ ఫార్మా రంగంలోనూ నెంబర్ వన్ గా ఉన్నాయన్నారు. కరోనా సమయంలోనూ ప్రపంచానికి హైదరాబాద్ లోని జీనోమ్ వ్యాలీ వ్యాక్సిన్ అందించిందన్నారు. రాజకీయ కారణాల వల్ల ఏపీ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా గతంలో తీసుకువచ్చిన సంస్కరణలు తెలుగు ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచాయన్నారు. ఇప్పుడు ఇక క్వాంటం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్స్ లాంటి భవిష్యత్ టెక్నాలజీలతో రాష్ట్రంలో సుపరిపాలన అందించేలా కార్యాచరణ చేస్తున్నామని అన్నారు. గ్రీన్ హైడ్రోజన్ గ్రీన్ అమ్మోనియా లాంటి రంగాలు విద్యుత్ రంగాన్ని శాసిస్తాయని సుస్థిర విద్యుత్ ఉత్పాదనతో విద్యుత్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం రాబోదన్నారు. ప్రస్తుతం యుద్ధ ప్రభావం నేపథ్యంలో ఎల్పీజీ కొరత ఏర్పడిందని ఈ కారణంగానే పైప్డ్ నాచురల్ గ్యాస్ సరఫరా కీలకంగా మారిందన్నారు. యుద్ధానంతర పరిస్థితుల రీత్యా వివిధ అంశాల్లో మనల్ని మనం సర్దుబాటు చేసుకోవాల్సిన అంశాలు తలెత్తాయన్నారు. దక్షిణ భారత్ లోనే గ్రీన్ ఇంధనం ఉత్పత్తిలో ఏపీ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. ప్రస్తుతం ఏఐ లాంటి టెక్నాలజీ ద్వారా తిరుమల లాంటి పుణ్యక్షేత్రాల్లో దర్శనాల కోసం వేచి ఉండే సమయాన్ని కుదించగలిగామని వేగంగా దర్శనాలు చేయించే సామర్థ్యాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచగలగామన్నారు. ఆధునిక

- మిగతా 2వ పేజీలో

# ఇంధన సరఫరాపై మంత్రుల బృందం

## సీసీఎస్‌లో ప్రధాని మోదీ ఆదేశం

పశ్చిమాసియా సంక్షోభంపై సమీక్ష



-2లో

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశంలో ఇంధన సరఫరాపై పర్యవేక్షణకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ ఆదేశించారు. వివిధ శాఖల కార్యదర్శులనూ దీనిలో భాగస్వాముల్ని చేసి, పరిస్థితిని ఎదుర్కొనేందుకు పూర్తి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# హార్ముజ్‌పై అల్టిమేటం

## 48 గంటల్లోగా తెరవాలి

- లేకపోతే ఇరాన్ విద్యుత్కేంద్రాలను ధ్వంసం చేస్తాం: ట్రంప్
- అలాచేస్తే హార్ముజ్‌ను పూర్తిగా మూసేస్తామన్న ఐఆర్‌జీసీ
- ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడిన ఇరాన్
- డిమోనా, అరాద్ నగరాల్లో 200 మందికి గాయాలు

-2లో





-2లో

# ప్రభుత్వ చెప్పుచేతల్లో సీఈసీ!

## అభిశంసన తీర్మానంలో ప్రతిపక్షాల ధ్వజం

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ అభిశంసనకు ప్రతిపక్ష ఎంపీలిచ్చిన నోటీసుల్లో పలు ఆరోపణలు చేశారు. ఆయన ప్రభుత్వ చెప్పుచేతల్లో నడుస్తున్నారని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(సర్) చేపట్టి సామూహికంగా లక్షల సంఖ్యలో ఓట్లను తొలగించారని విమర్శించారు.

# లక్షన్నర కోట్లతో ఆర్సెలార్ ఉక్కు!

## అనకాపల్లి జిల్లాలో నేడు సీఎం శంకుస్థాపన

- హాజరుకానున్న డిప్యూటీ సీఎం పవన్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- రెండు దశల్లో ఉక్కు కర్మాగార నిర్మాణం
- 1.25 లక్షల మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభం!
- 2033కి పనులు పూర్తిచేయాలని లక్ష్యం




రాష్ట్రంలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చేలా దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంటు.. 'ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా' ఉక్కు కర్మాగారానికి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

అనకాపల్లి, మార్చి 22

సుమారు రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడితో దీనిని నిర్మించనున్నారు. సీఎం సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్లో బయల్దేరి 3.30కు నక్కపల్లి మండలం చందనాడ చేరుకుంటారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు స్థలాన్ని, బ్లూప్రింట్లను పరిశీలిస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఇదే సందర్భంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం 5.40 గంటలకు ఉండవల్లికి పయనమవుతారు. భూమిపూజ కార్యక్రమానికి

- మిగతా 6వ పేజీలో

# డిజిటల్ కమ్యూనికేషన్‌లో 'స్వదేశీ' విప్లవం షురూ!

## విదేశీ వేదికలకు ప్రత్యామ్నాయంగా 2 యాప్‌లు

అనువాదిని ఏఐ సీఈఓ బుద్ధా చంద్రశేఖర్

-6లో

విదేశీ కమ్యూనికేషన్ వేదికలకు ప్రత్యామ్నాయ వేదికలను సిద్ధం చేశామని అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ తెలిపారు. డిజిటల్ కమ్యూనికేషన్స్‌లో స్వదేశీ విప్లవం ప్రారంభమైందని చెప్పారు.



# ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుందాం

## రాష్ట్రంలో పెద్దఎత్తున తాగునీటి ప్రాజెక్టుల పనులు

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుని భవిష్యత్తును కాపాడుకుందామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. నీటి ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు.



-2లో

# ఆకాశాన్నంటుతున్న చికెన్ ధరలు

## స్కిన్‌లెస్ కోడిమాంసం కిలో రూ.400

- పెద్ద బ్రాయిలర్ కూడా రూ.300పైనే
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు
- రంజాన్, ఫంక్షన్ల వల్ల పెరిగిన డిమాండ్
- పౌల్ట్రీలో ఒక్కసారిగా తగ్గిన ఉత్పత్తి
- మరోవైపు గుడ్డు ధర నేల చూపులు..
- చెన్నై నుంచి గల్ఫ్ దేశాలకు ఆగిన ఎగుమతి



-6లో

# అప్పుడు ఐటీ... ఇప్పుడు క్వాంటం

(మొదటి పేజీ తరువాయి)

ల్యాబ్ ద్వారా ప్రసాదం తయారీలో వినియోగించే పదార్థాలను నిత్యం పర్యవేక్షిస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో లా కల్తీ నెయ్యి వినియోగించేందుకు ఇక ఆస్కారం ఉండబోదన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని నిరంతరం తెలుసుకునేలా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామన్నారు. త్వరలో ఏఐ డాక్టర్ సేవలతో పాటు రైతులకు ఉపకరించేలా ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందించబోతున్నామన్నారు. పాలనలో ఇవాళ తీసుకున్న నిర్ణయాలన్నీ రేపటికి చరిత్ర అవుతాయని..గతంలో తీసుకున్న స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు ఫలితాలు ఇచ్చాయన్నారు. ప్రస్తుతం అమరావతిని టెక్నాలజీ అనుసంధానించి స్మార్ట్ సిటీగా బ్లూ గ్రీన్ రాజధానిగా నిర్మిస్తున్నామని అన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని అన్నారు. గోదావరిలో వచ్చే 50 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రాజెక్టు పూర్తి అయితే ఇతర రాష్ట్రాలకు కూడా ప్రయోజనాలు కలిగేలా చేయవచ్చన్నారు. ఏపీలో మూడు రీజియన్లుగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. అమరావతిలో త్వరలోనే క్వాంటం కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుందని సీఎం వివరించారు. త్వరలోనే క్వాంటం కంప్యూటర్ తయారీకి అవసరమైన పరికరాల తయారీ కూడా చేసేలా ప్రణాళికలు చేశామన్నారు. ఇప్పుడు గూగుల్ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేయబోతోందని.. రిలయన్స్ కూడా డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. 2047 స్వర్ణాంధ్ర ద్వారా రాష్ట్రాభివృద్ధికి విజన్ రూపకల్పన చేశామన్నారు. వ్యవసాయం, సేవల రంగం, పారిశ్రామిక రంగం అభివృద్ధికి వీలుగా ప్రణాళికలు రూపొందించుకున్నామని వివరించారు. ఉద్యాన, ఆక్వా రంగాల్లో కూడా ఎగుమతుల ద్వారా వృద్ధి సాధించేలా చర్యలు చేపట్టామని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో యువ పారిశ్రామిక వేత్తల అవసరం చాలా ఉందని..దీనిని అందిపుచ్చుకోవాలని కోరుతున్నానని సీఎం అన్నారు. ఏపీని దేశంలోనే అగ్రస్థాయి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించామని..15 శాతం వృద్ధి రేటు నిలకడగా కొనసాగేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.



### పీపీపీలది సక్సెస్ ఫార్ములా

ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుంటూ పీపీపీ విధానంలో చేపట్టిన జేగూరుపాడు విద్యుత్ ప్రాజెక్టు చేపట్టామని సీఎం వెల్లడించారు. 30 ఏళ్ల తర్వాత ఆ ఆస్తి మళ్లీ ప్రభుత్వానికి తిరిగివచ్చిందని సీఎం అన్నారు. చాలా రంగాల్లో ఇదే సక్సెస్ ఫార్ములాగా మారిందన్నారు. భారత్ లో చేపట్టిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రోడ్డు, ఎయిర్ పోర్టులు ఇలా వేర్వేరు ప్రాజెక్టులు విజయం సాధించాయన్నారు. వేర్వేరు సంస్కరణల ఫలితంగా సంపద పెరిగిందని .. అదే సమయంలో సమాజానికి వెనక్కు తిరిగి ఇవ్వాలన్న ఆలోచన ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గిరిజనులు పండించే అరకు కాఫీని మార్కెటింగ్ చేసేందుకు గతంలో నాందీ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని.. ఇప్పుడు దానిని ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసే బాధ్యతను ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా తీసుకున్నారని వెల్లడించారు. సమాజంలో అట్టడుగున ఉండిపోయిన పేదవారిని ఆదుకునేందుకు పీ4 ఎంబీకే 10-20 కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. పేదలకు చేయూత అనేది చాలా కీలకమని తద్వారా వారు సామాజికంగా ఆర్థికంగా పైకి ఎదగగలుగుతారని సీఎం వివరించారు. వివిధ దేశాల్లో వయోవృద్ధుల సంఖ్య పెరుగుతోందని ..2047 తర్వాత భారత్ లోనూ ఇదే సమస్య వచ్చే అవకాశం ఉందని సీఎం అన్నారు. దక్షిణ భారత్ లోనూ ఫెర్టిలిటీ రేటు పెరిగేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అందుకే పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ద్వారా ప్రోత్సాహం కల్పించాలని నిర్ణయించామన్నారు.

### గత పాలనలో అంతా విధ్వంసమే

2024 లో మళ్లీ తాము అధికారంలోకి వచ్చే సమయానికి ఏపీ అంతా సర్వనాశనం అయ్యిందని..గత పాలకులు ఐదేళ్ల పాలనా కాలంలో బ్రాండ్ పోయిందని.. వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని వివరించారు. రాష్ట్ర విభజన కంటే దారుణగా రాష్ట్ర పరిస్థితి తయారైందని అన్నారు. ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందని .. అయితే 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రోగ్రెసివ్ నిర్ణయాలు తీసుకుని సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన చేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం పెట్టుబడుల్ని ఆకర్షించటంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని వివరించారు. గతంలో అమరావతి నిర్మాణం జరుగుతుండగా గత పాలకులు శ్మశానం అని గేలి చేసి విధ్వంసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ దానిని పునర్నిర్మిస్తున్నామని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కూడా 2019 వరకూ 72 శాతం పనులు పూర్తి చేశామని గత పాలకులు పట్టించుకోక విధ్వంసం చేశారన్నారు. రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రాం వాల్ ధ్వంసం అయ్యిందని .. మళ్లీ అదే పనిని రూ. వెయ్యి కో ట్లతో చేపట్టాల్సి వచ్చిందన్నారు.

### సమ్మిట్ లో చంద్రబాబు విజన్ ప్రజెంటేషన్

ఈఓ సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్ 2026లో హైదరాబాద్ ను హైటెక్ సిటిగా మలిచిన తీరుపై నిర్వాహకులు వీడియోను ప్రదర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ ఐటీ కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దటంలో చంద్రబాబు విజన్ ను నిర్వహాకులు ఈ వీడియోలో ప్రదర్శించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ను 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మార్చేందుకు ప్రణాళికలు చేస్తున్నారంటూ దాంట్లో పేర్కొన్నారు. 1995 నుంచి హైటెక్ సిటీ నిర్మాణం, జీనోమ్ వ్యాలీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీల రాక లాంటి అంశాలను ప్రస్తావిస్తూ వీడియో ప్రదర్శించారు. ప్రస్తుతం క్వాంటం వ్యాలీ, ఏఐ పై ఏపీ ఫోకస్ పెట్టిందంటూ ఇచ్చిన ప్రజెంటేషన్ సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్ కు హాజరైన పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకట్టుకుంది.

# ప్రభుత్వ చెప్పుచేతల్లో సీఈసీ!

న్యూఢిల్లీ, మార్చి 22

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కర్ణాటకలోని మహదేవ్‌పురా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తే ఆయన్ను వివక్షపూరితంగా టార్గెట్ చేశారని తెలిపారు. ఓట్ల అవకతవకలపై దర్యాప్తునకు నిరాకరించడమే గాక.. గత ఏడాది ఆగస్టు 17న విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి.. రాహుల్ క్షమాపణ చెప్పాలని.. లేదంటే ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారని ఆక్షేపించారు. జ్ఞానేశ్‌కుమార్ దుష్ప్రవర్తన నిరూపితమైందన్నారు. కమిషన్ స్వతంత్రత, రాజ్యాంగ విశ్వసనీయత పరిరక్షణలో ఆయన విఫలమయ్యారని తెలిపారు. 'సుదీర్ఘ కాలం పట్టే 'సర్' ప్రక్రియను ఎన్నికలు జరిగే పెద్ద రాష్ట్రాల్లో రాకెట్ వేగంతో పూర్తిచేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో బిహార్లో 65 లక్షల ఓట్లు తొలగించారు. బెంగాల్లో 56 లక్షల ఓట్లు తీసేశారు. ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముంగిట మరో 60 లక్షల ఓట్లను పరిశీలన పేరిట సందిగ్ధంలో పడేశారు. దేశవ్యాప్తంగా జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ)ని అమలు చేస్తామన్న కేంద్ర హోం మంత్రి వైఖరికి సంపూర్ణ అనుకూలంగా ఉంది. జ్ఞానేశ్‌కుమార్ తటస్థ ఎన్నికల కమిషన్‌ను ప్రభుత్వ రాజకీయ ఎజెండా సాధనంగా మార్చేశారు. నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ సంస్థను పౌరసత్వ నిర్ధారణ ట్రైబ్యునల్‌గా మార్చారు' అని దుయ్యబట్టారు. సీఈసీ నియామక ప్రక్రియను కూడా ఎంపీలు ప్రస్తావించారు. ఆయన నియామకంపై దాఖలైన పిటిషన్ సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉందన్నారు. విపక్షాలకు చెందిన 130 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు సంతకాలు చేసిన ఈ నోటీసులను ఈ నెల 12న ఉభయసభలకు సమర్పించిన సంగతి తెలిసిందే. అభిశంసన తీర్మానాన్ని ఉభయసభలూ ఆమోదిస్తే.. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ కలిసి.. భారత ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి, 25 రాష్ట్రాల హైకోర్టుల్లోని ఏదో ఒక హైకోర్టు చీఫ్ జస్టిస్, ప్రముఖ న్యాయకోవిదుడితో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేస్తారు. విచారణలో సాక్షులను, నిందితులను క్రాస్‌ఎగ్జామిన్ చేస్తారు. సీఈసీ కూడా కమిటీ ముందు హాజరై తన వైఖరి చెప్పుకొనే అవకాశం ఉంటుంది. ఈ కమిటీ నివేదికను ఉభయసభల ముందు ఉంచి అభిశంసనపై చర్చ ప్రారంభిస్తారు. సభల్లో చర్చించేటప్పుడు జ్ఞానేశ్‌కుమార్‌కు తన వాదన వినిపించే హక్కు ఉంటుంది. అయితే సభ ప్రవేశ ద్వారం వద్ద ఆయన నిల్చోవాలి. ఆయన్ను తొలగించాలంటే రెండు సభలూ తీర్మానాన్ని ఆమోదించాల్సి ఉంటుంది.



# 'ప్రభుత్వాధినేత'గా మోదీ రికార్డు

## 8,931 రోజుల పదవీకాలం పూర్తి

దిల్లీ, మార్చి 22

ప్రభుత్వాధినేతగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. తొలుత గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా, తర్వాత దేశానికి ప్రధానమంత్రిగా గత 8,931 రోజులుగా ఏకధాటిగా ఆయన అధికారంలో ఉన్నారు. ఇప్పటివరకు సుదీర్ఘకాలం ప్రభుత్వాధినేతగా ఉన్న ఘనత సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్‌కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. ఆయన 8,930 రోజులపాటు అధికారంలో ఉన్నారు. మోదీ ఆదివారం దానిని అధిగమించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు, ఎన్డీయే భాగస్వామ్యపక్షాల నేతలు ఆయన సేవల్ని కొనియాడారు. ప్రజాసేవలో ప్రధానమంత్రి మోదీ ప్రయాణం అంకితభావం, క్రమశిక్షణ, దేశం పట్ల నిస్వార్థ సేవకు గొప్ప ఉదాహరణ అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో ప్రధానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 24 ఏళ్లకు పైగా అవిశ్రాంతంగా పనిచేస్తున్న ప్రధాని జీవితం యువతకు ప్రేరణగా నిలుస్తుందన్నారు.

# ఇంధన సరఫరాపై మంత్రుల బృందం

దిల్లీ, మార్చి 22

రంగాలవారీగా కూడా బృందాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఆదివారం సాయంత్రం భద్రత వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పశ్చిమాసియాలో యుద్ధం తర్వాత మన దేశానికి ముడిచమురు, గ్యాస్, ఇతర పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల సరఫరా వంటివి ఎలా ఉన్నాయో సమీక్షించారు. రసాయన, ఔషధ, పెట్రో రసాయనాలు, ఇతర పరిశ్రమలకు అవసరమైన దిగుమతులను ఇతర దేశాల నుంచి చేసుకునేందుకు ఉన్న అవకాశాలపై సీసీఎస్‌లో చర్చించారు. తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలపై సమాలోచనలు జరిపారు. యుద్ధం వల్ల ప్రపంచమంతటిపై ఒకే విధమైన ప్రభావం పడుతోందని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మన పౌరుల్ని రక్షించేందుకు అవసరమైన చర్యలన్నీ చేపట్టాలని చెప్పారు. అసౌకర్యాలను వీలైనంత తక్కువ స్థాయికి తగ్గించడానికి మంత్రిత్వ శాఖలన్నీ కలిసి పనిచేయాలని, నిత్యావసర వస్తువులు నల్లబజారుకు తరలిపోకుండా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. క్యాబినెట్ కార్యదర్శి డాక్టర్ టి.వి.సోమనాథన్ తొలుత సమగ్రంగా వివరాలను నివేదించారు. వివిధ మంత్రిత్వశాఖలు చేపట్టిన చర్యల్ని వివరించారు. హాజరైన మంత్రుల్లో రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, జైశంకర్, నడ్డా, గోయల్, అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్‌నాయుడు తదితరులు ఉన్నారు.

# ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుందాం

అమరావతి, మార్చి 22

నీటి ప్రాధాన్యాన్ని తెలియజెబుతూ జలజీవన్ మిషన్, ఉపాధి హామీ పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు, తాగునీటి ప్రాజెక్టుల పనులను వివరించారు. 'గత 20 నెలల్లో ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం గల 1,06,788 వ్యవసాయ కుంటలు, 13,500 పశువుల తొట్టెలను నిర్మించాం. 1.46 కోట్ల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.9,441 కోట్లతో 8 మల్టీ విలేజ్ నీటి పథకాల పనులు చేపట్టాం. రూ.9,355 కోట్లతో త్వరలో మరో ఏడు మల్టీ విలేజ్ పథకాల పనులు ప్రారంభం కానున్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న మరో 3వేల గ్రామాల్లో 38.54లక్షల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.1,81 4.71 కోట్లతో పనులు చేపట్టనున్నాం' అని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# హార్మూజ్‌పై అల్టిమేటం

కైరో, మార్చి 22

పశ్చిమాసియాలో యుద్ధం రోజురోజుకూ మరింత తీవ్రస్థాయికి చేరుతోంది. తమ నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ తాజాగా విరుచుకుపడింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని డిమోనా, అరాద్ నగరాలపై అది జరిపిన దాడుల్లో దాదాపు 200 మంది గాయపడ్డారు. డిమోనాకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని ఇజ్రాయెల్ అణు పరిశోధన కేంద్రాన్ని ఇరాన్ లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు- హార్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలంటూ టెహ్రాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్కేంద్రాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. ఆయన హెచ్చరికపై టెహ్రాన్ దీటుగా స్పందించింది. తమ విద్యుత్కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే.. పశ్చిమాసియా వ్యాప్తంగా కీలక మౌలిక సదుపాయాలు, ఇంధన వసతులను ధ్వంసం చేస్తామని బదులిచ్చింది. హార్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తామనీ హెచ్చరించింది. నతాంజ్‌పై దాడికి ప్రతిగా.. ఇజ్రాయెల్ అణ్వాయుధ కార్యక్రమంలో అత్యంత కీలకమైన ది షిమోన్ పెరెస్ నెగెవ్ అణు పరిశోధన కేంద్రాన్ని ఇరాన్ శనివారం రాత్రి లక్ష్యంగా చేసుకుంది. దానిపైకి క్షిపణులను ప్రయోగించింది. టెహ్రాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణుల్లో రెండింటిని ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకోలేకపోయాయి. వందల కిలోల పేలుడు పదార్థాలతో దూసుకొచ్చిన ఈ క్షిపణుల్లో ఒకటి డిమోనాలో, మరొకటి అరాద్‌లో పడ్డాయి. దీంతో పలు భవనాలు ధ్వంసమయ్యాయి.



రెండు నగరాల్లో కలిపి దాదాపు 200 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరు చిన్నారులు సహా 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించినప్పటికీ.. వాటిని అడ్డుకోలేకపోవడంపై దర్యాప్తు జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. తాజా దాడుల్లో అణు పరిశోధన కేంద్రం దెబ్బతినలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) కూడా 'ఎక్స్'లో ఇదే విషయాన్ని పేర్కొంది. డిమోనాను 'లిటిల్ ఇండియా'గా పిలుస్తారు. ఇక్కడ భారత సంతతి ప్రజలు దాదాపు 7,500 మంది నివసిస్తున్నారు. వీరిలో అత్యధికులు మహారాష్ట్ర, కేరళ, పశ్చిమ బెంగాల్‌ల నుంచి వచ్చి స్థిరపడ్డవారే. డిమోనా, అరాద్‌లపై దాడుల తర్వాత ఇరాన్ సైనికాధికారులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ గగనతలానికి ప్రస్తుతం రక్షణ లేదన్నారు. ఇకపై తాము చేసే దాడులు వాషింగ్టన్, టెల్‌అవీవ్‌లను ఆశ్చర్యపరుస్తాయని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాల గగనతలంలో తమ క్షిపణులు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని ఇరాన్ ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ అధిపతి మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ మూసావి అన్నారు. సెంట్రల్ ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్లస్టర్ బాంబులతో ఆదివారం దాడులు చేసింది. టెల్ అవీవ్‌తో పాటు దాని సమీప నగరాల్లో ఈ పేలుడు పదార్థాల కారణంగా 36 మంది గాయపడ్డారు. వారిలో 19 మంది చిన్నారులే. హార్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలని ఇరాన్‌కు ట్రంప్ శనివారం రాత్రి అల్టిమేటం జారీ చేశారు. లేకపోతే ఆ దేశంలోని విద్యుత్ కేంద్రాలను నాశనం చేస్తామని, అతిపెద్ద విద్యుత్కేంద్రంపై దాడితో ఆ పనిని మొదలుపెడతామని 'ట్రూత్ సోషల్' వేదికగా హెచ్చరించారు.

ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) స్పందించింది. తమ విద్యుత్కేంద్రాలపై అమెరికా దాడి చేస్తే.. హార్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తామని పేర్కొంది. కట్టుదిట్టమైన భద్రత ఉండే డిమోనా వంటి ప్రాంతంలోనూ తమ క్షిపణులను ఇజ్రాయెల్ అడ్డుకోలేకపోవడం యుద్ధంలో కొత్త దశకు సంకేతమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు. అమెరికా తమ విద్యుత్కేంద్రాలపై దాడులకు దిగితే.. పశ్చిమాసియా వ్యాప్తంగా ఇంధన మౌలిక వసతులను నాశనం చేస్తామని హెచ్చరించారు.

హార్మూజ్ సమీపంలో శత్రువులకు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని కూల్చివేశామని ఇరాన్ తెలిపింది. ఎఫ్-15ను తమ గగనతల రక్షణ వ్యవస్థ విజయవంతంగా లాకింగ్ చేస్తున్నట్లున్న వీడియో ఒకటి ఇరాన్ మీడియాలో విడులైంది. అమెరికాతో పాటు సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, ఖతార్ వంటి పశ్చిమాసియా దేశాల వద్ద ఎఫ్-15లు ఉన్నాయి.

ఇరాన్ నుంచి యావత్ ప్రపంచ భద్రతకు ముప్పు పొంచి ఉందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అన్నారు. అందుకే అందరి తరఫున.. అమెరికా, తాము కలిసి ఆ దేశంపై పోరాడుతున్నామని పేర్కొన్నారు. అరాద్‌లో క్షిపణి దాడి జరిగిన ప్రాంతాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐరోపాపైనా దాడి చేయగల సామర్థ్యం ఇరాన్‌కు ఉందని చెప్పేందుకు డిగో గార్సియాపై అది చేసిన దాడే నిదర్శనమని చెప్పారు. మరోవైపు- నతాంజ్ అణుకేంద్రంపై దాడితో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్ ప్రాంతంపై ఆదివారం రాకెట్ దాడిలో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ప్రస్తుత యుద్ధం మొదలయ్యాక హెజ్‌బొల్లా దాడితో ఇజ్రాయెల్‌లో నమోదైన తొలి మరణం ఇదే.

దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడిలో నలుగురు హెజ్‌బొల్లా ముష్కరులు హతమయ్యారు.

సౌదీ అరేబియా రాజధాని రియాధ్‌వైపు ఆదివారం మూడు బాలిస్టిక్ క్షిపణులు దూసుకొచ్చాయి. వాటిలో ఒకదాన్ని సౌదీ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. మిగిలిన రెండు జనావాసాల్లేని ప్రాంతాల్లో పడ్డాయి. తూర్పు సౌదీలో ఆరు డ్రోన్లను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. తమ దేశంపై ఇరాన్ చేస్తున్న వరుస దాడులకు నిరసనగా రియాధ్‌లోని ఇరాన్ దౌత్యాధికారుల్ని సౌదీ అరేబియా బహిష్కరించింది. .

బ్రిటన్‌కు చెందిన అణు జలాంతర్గామి 'హెచ్ఎంఎస్ ఆన్సన్' హార్మూజ్ జలసంధి సమీపానికి చేరుకుందని, దాన్ని ప్రస్తుతం ఉత్తర అరేబియా సముద్రంలో మోహరించారని బ్రిటిష్ మీడియాలో తాజాగా కథనాలు వెలువడ్డాయి. ఈ జలాంతర్గామిలో తోమహాక్ క్షిపణులు, భారీ టోర్పిడోలు, శక్తిమంతమైన ఆయుధ సంపత్తి ఉన్నట్లు సమాచారం.

ఖతార్‌కు చెందిన ఓ హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగా పర్షియన్ గల్ఫ్‌లో శనివారం కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. వారిలో ముగ్గురు ఖతార్ భద్రతా బలగాల సిబ్బంది, ముగ్గురు తుర్కియే జాతీయులు ఉన్నారు.



## ఎండ తీవ్రతలో పాదచారులకు మజ్జిగ పంపిణీ

### 58వ డివిజన్‌లో సేవా కార్యక్రమం

**విజయవాడ, మార్చి 22**

సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్ పైపుల రోడ్ సెంటర్‌లో డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమమహేశ్వరరావు ఆశీస్సులతో సంసాని ఉదయ్ సత్యసాయి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సుమారు 660 మంది పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆంధ్రుల అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయకుమారి మాట్లాడుతూ, సేవా కార్యక్రమాలను విస్తరించి మరింత మంది అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. దాతలు, ప్రభుత్వం సహకారం అందిస్తే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఎస్ఐ జె. కృష్ణ అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన దాతలకు, సహకరించిన వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపం అమ్మ



**విజయవాడ, మార్చి 22**

సృష్టిలో అమ్మ ప్రేమను మించిన విలువైన వస్తువు మరొకటి లేదని, అచ్చమైన స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపం అమ్మ అని నెల్లూరు బాల భవన్ డైరెక్టర్ గోవిందరాజుల సుభద్ర అన్నారు. హాస్యానందం మాసపత్రిక ఆధ్వర్యంలో ఆదివారం బంగారు తల్లి పురస్కార ప్రదానోత్సవం కేబీఎన్ కళాశాల లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుభద్ర మాట్లాడుతూ తాను ఎన్ని కష్టాలు పడుతున్న బిడ్డల అభివృద్ధి కోసం ప్రతిఫలం కోరకుండా త్యాగం చేసేది అమ్మ మాత్రమే అన్నారు. హాస్యానందం సంపాదకులు రాము తమ మాతృమూర్తి సంస్మరణ పూర్వకంగా ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. యువ కళావాహిని హైదరాబాద్ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సృష్టిలోని భగవంతుడు మనిషికి ఇచ్చిన అద్భుతమైన వరం అమ్మ అన్నారు. నాట్య నిలయం డైరెక్టర్ స్వర్ణలత భారతి, వ్యాపారవేత్త కేవీపీ సత్యనారాయణ, జ్యోతిష విజ్ఞాన వేత్త పాలపర్తి శ్రీకాంత శర్మ, ఆంధ్ర కార్టూనిస్టుల సంఘం అధ్యక్షుడు అన్నం శ్రీధర్ (బాచి), తమ ప్రసంగాలలో రాము తమ తల్లి పేరు మీద చేస్తున్న సేవలను ప్రశంసించారు. ముద్రణ రంగ ప్రముఖులు తోటకూరి లక్ష్మికి బంగారు తల్లి పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. సింగిల్ పేజీ హాస్య కథల పోటీలు, సిగ్గు లేకపోతేక్ అంశం మీద నిర్వహించిన కార్టూన్ పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. ప్రముఖ కార్టూనిస్టులు ఏవీఎం, హరికృష్ణ, కేబీఎన్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, హాస్యానందం పత్రిక సంపాదకులు రాము తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రముఖ నర్తకి సత్య శ్రీ అంశాలు ప్రదర్శించి సభకు స్వాగతం పలికింది. డాక్టర్ కె. రామకృష్ణ సభను నిర్వహించారు.

## రజక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



**ఆగిరిపల్లి, మార్చి**

ఆగిరిపల్లి రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సగ్గుర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా గరిసేపల్లి లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా నైనవరపు వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సగ్గుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘం ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన

### హెల్మెట్ తప్పనిసరి, వేగం తగ్గించాలి: ఎస్ఐ శుభశేఖర్



**ఆగిరిపల్లి, మార్చి 22**

ఆగిరిపల్లి గ్రామంలో ఎస్ఐ శుభశేఖర్ తన సిబ్బందితో కలిసి విజయవాడ మార్గంలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ పలు ముఖ్య సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించడంలో కీలకమని ఆయన తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని సూచించారు. "వేగం వద్దు – ప్రాణం ముద్దు" అనే నినాదాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబ సభ్యులు తమపై ఆధారపడి ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకొని జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ శుభశేఖర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపిడబ్ల్యుజెఎఫ్ తిరుపతి జిల్లా కొత్త కమిటీ ఎన్నిక

- జిల్లాఅధ్యక్షులుగా గాజుల చెంగల్రాయులు (గాంధీ), ప్రధాన కార్యదర్శిగా వళిగళం గోపి, కోశాధికారిగా కె. శ్రీనివాస్ ఎన్నిక







**తిరుపతి, మార్చి 22**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లాఅధ్యక్షులుగా గాజుల చెంగల్రాయులు (గాంధీ) ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా వళిగళం గోపి, కోశాధికారిగా కె. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి. చెంగల్రాయులు, మల్లెల వాణి, నందకుమార్, కె. రవి, డి. ధనశేఖర్, ఘట్టమనేని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఎం. సురేష్ రాజ, డి.వి. రావు, రాజారెడ్డి, జయకుమార్, సి.ఆర్. శ్రీనివాసన్, రాజారెడ్డి ఎంపికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా టి. తులసీరామ్, మీడియా కోఆర్డినేటర్‌గా పి. సుధీర్ ఎన్నిక కాగా, కార్యవర్గ సభ్యులుగా పి. మునిభాస్కర్ రెడ్డి, కె. హరి బాబు, గంధం చంద్రశేఖర్, కె. నాగరాజ, రాధాసురేష్, ఎ. ప్రకాష్, కె. సుధాకర్, పి. యాసిన్, జి. చంద్రశేఖర్, ఆర్. భక్తవత్సల రెడ్డి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు సీనియర్ జర్నలిస్టు ఆదిమూలం శేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. తిరుపతిలోని ప్రెస్ భవనంలో ఆదివారం నిర్వహించిన ఏపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ప్రథమ మహాసభల్లో ఈ ఎన్నికలు జరిగాయి.

# రైతు నేస్తం అవార్డు అందుకున్న మద్దిరాల కమలాకరరావు

**విజయవాడ, మార్చి 22**

విజయవాడ కేఎల్ రావు నగర్‌కు చెందిన మద్దిరాల కమలాకరరావు గారు "రైతు నేస్తం అవార్డు" అందుకోవడం గర్వకారణంగా నిలిచింది. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎంపికైన ఈ ప్రతిష్టాత్మక అవార్డును కేంద్ర గ్రామీణ అభివృద్ధి సంక్షేమ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు సమక్షంలో అందుకున్నారు. కరోనా సమయంలో చిన్న స్థాయిలో ప్రారంభమైన "మద్దిరాల మిద్దె తోట" నేడు విశేష గుర్తింపు పొందడం అభినందనీయం. సహజ పద్ధతిలో రసాయన రహిత కూరగాయలు పండిస్తూ సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించడం ఆయన ముఖ్య లక్ష్యం. ఈ సందర్భంగా కమలాకరరావు గారు మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు గౌరవంతో పాటు మరింత బాధ్యతను కూడా కల్పించిందని తెలిపారు. రైతు నేస్తం సంస్థ,



రఘోతమరెడ్డి గారు, యడ్లపల్లి వెంకటేశ్వరరావు గారు, అలాగే "ఆన్ ఎర్త్ వన్ లైఫ్" టీమ్ అడ్మిన్స్ మరియు సభ్యులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన విజయానికి తన ధర్మపత్నీ లుదియ సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే, తనతో పాటు రైతు నేస్తం అవార్డు అందుకున్న ఇతర అవార్డు గ్రహీతలందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇకపై "హరిత ఆంధ్ర ప్రదేశ్" సాధనలో భాగంగా మిద్దె తోటల ప్రాముఖ్యతపై విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తానని సంకల్పించారు. మిద్దె తోట ద్వారా పండిన రసాయన రహిత కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడంతో పాటు, తోట పనులు శారీరక వ్యాయామంగా కూడా ఉపయోగపడతాయని తెలిపారు. అంతేకాకుండా, నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ చిన్న స్థాయిలో అయినా మిద్దె తోటలను ప్రారంభించాలని, ఇతర మిద్దె తోట దారులను కూడా ఇటువంటి అవార్డులు అందుకునేలా ప్రోత్సహిస్తానని ఆయన పేర్కొన్నారు.

# ప్రజలకు ఉచిత వైద్య సేవలు







- 15వ డివిజన్‌లో మెగా హెల్త్ క్యాంప్

**విజయవాడ, మార్చి 22** విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్, ఈనాడు కాలనీ కొల్లపర వారి వీధిలో ఉన్న సాయిబాల విద్యాలయంలో హెల్ప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మాజీ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఆళ్ల చెల్లారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రజలు తమ ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు చేయించుకొని, వైద్యుల సూచనల మేరకు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. శిబిరంలో డాక్టర్ అశోక్ కుమార్ (ఎమ్.డి., కార్డియాలజిస్ట్), డాక్టర్ పువ్వాడ ప్రశాంత్ (సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్), డాక్టర్ గౌరా హరి (ఆర్థోపెడిక్ సర్జన్) తదితరులు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మధు, వేట నాని, కాటూరు బాబి, సాయిబాల విద్యాలయం ప్రిన్సిపల్ రమణారెడ్డి, చిన్ని మరియు స్థానికులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల మనోభావాలను దెబ్బతీశారు

- మధ్యాహ్న భోజన పథకంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన
- గరికపాటిపై చర్యలు తీసుకోవాలి
- అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయఉపాధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్



**విజయవాడ, మార్చి 22**

మధ్యాహ్న భోజన పథకంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గరికపాటి నరసింహారావుపై ప్రభుత్వం సుమోటుగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై అవమానకర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అధిక శాతం దళిత, బహుజన వర్గాలకు చెందిన వారేనని, అలాంటి వర్గాల మనోభావాలను దెబ్బతీయే విధంగా గరికపాటి చేసిన వ్యాఖ్యలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న పథకాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయమని కిరణ్ రాజ్ విమర్శించారు. "పిల్లలు కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారు" అని చెప్పడం, చదువును "మిథ్య"గా వ్యాఖ్యానించడం విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల హాజరు పెంచడంలో, డ్రాప్‌అవుట్ తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయని తెలిపారు. దేశంలో పోషకాహార లోపం ఉన్న పరిస్థితుల్లో కోడిగుడ్డును అవమానకరంగా వ్యాఖ్యానించడం ఆకలిని కించపరచడమేనని అన్నారు. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత కాగా, దానిని "బిచ్చం"గా అభివర్ణించడం సరైంది కాదని విమర్శించారు. గరికపాటి నరసింహారావు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేదంటే ప్రభుత్వం సుమోటుగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కిరణ్ రాజ్ డిమాండ్ చేశారు.

# చికెన్ ధరల పెరుగుదలపై వెంటనే సమీక్షించాలి



- వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా)

**జగ్గయ్యపేట, మార్చి 22** రాష్ట్రంలో పెరిగిన చికెన్ ధరలపై జగ్గయ్యపేటలోవైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలుగుప్పించారు. ఆదివారం తన నివాసంలో నిర్వహించినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో చికెన్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని,దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చికెన్అందని ద్రాక్షగా మారిందన్నారు. ఎన్.ఇ.సి.సి.నిర్దేశించిన ధరల కంటే ఎక్కువగా వసూలుచేస్తున్నారని ఆరోపించారు. తక్కువ ధరలకు కోళ్లుకొనుగోలు చేసి, కొన్ని ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, మధ్యలో సిండికేట్ వ్యవస్థ లాభపడుతోందని విమర్శించారు. చికెన్ ధరల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అధికారులు కూడా తనిఖీలు చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిడులు ఉన్నాయా అని ప్రశ్నించారు.నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, చికెన్ ధరల పెరుగుదల మరింత ఆర్థిక భారం మోపుతోందన్నారు. రైతులకు సరైన ధరలు అందకపోవడంతో పాటు వినియోగదారులు కూడా దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. ధరల దోపిడీపై ప్రభుత్వం వెంటనే స్పందించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధరల వ్యవస్థలో పారదర్శకత తీసుకురాకపోతే ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా ముద్రపడే ప్రమాదం ఉందన్నారు.

## నారా భువనేశ్వరి కుప్పం పర్యటనను

# విజయవంతం చేయండి

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, మార్చి 22**

కుప్పం నియోజకవర్గంలో 4 రోజుల పాటు జరగనున్న నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనతో పాటు పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 24 నుండి 27వ తేదీ వరకు భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, మహిళలతో సమావేశాలు నిర్వహించడం, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మొదటిరోజు పర్యటనలో భాగంగా శివపురం గ్రామ పరిధిలోని తమ సొంత నివాసంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని, అనంతరం మంకలదొడ్డి గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం, అంగన్వాడీ కేంద్రం సందర్శన, సింగారపురం, మొట్లచెను, కూసూరు గ్రామాల్లో మహిళలతో సమావేశాలు నిర్వహిస్తారు. పైపాల్యం గ్రామంలో "విలువల బడి" కార్యక్రమంలో విద్యార్థులతో సమావేశం కానున్నారని తెలిపారు. అలాగే టీటీడీ కళ్యాణమండపంలో జరిగే వివాహ వేడుకల్లో పాల్గొన్నట్టు తెలిపారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా ఉదయం తమ గృహంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, కడ అడ్వైజర్ మెంబర్ రాజకుమార్ ఇంటి గృహప్రవేశంలో పాల్గొంటారని, అనంతరం కుప్పం డిగ్రీ కళాశాలలో జరగనున్న జాబ్ మేళాలో పాల్గొని, పెద్దకోటకనపల్లి, తంబిగానిపల్లి గ్రామాల్లో పర్యటించడంతో రెండవ రోజు పర్యటన ముగుస్తుందన్నారు. మూడవరోజు పర్యటనలో భాగంగా యధావిధిగా తొలత ప్రజల నుండి అర్జీలు స్వీకరించడంతో ప్రారంభించి, శాంతిపురం మండల కేంద్రంలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల మరణించిన ఐటీడీపీ కార్యకర్త రవి కుటుంబ సభ్యులను గుండిశెట్టిపల్లిలోని వారి గృహంలో పరామర్శించి, రామకుప్పం మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, బల్ల గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, కుప్పం పట్టణంలో టీడీపీ నేత గోపీనాథ్‌కు చెందిన కాంప్లెక్స్‌ను ప్రారంభించడంతో 3వ రోజు పర్యటన ముగుస్తుందన్నారు. నాలుగవ రోజు పర్యటనలో భాగంగా కుప్పం పట్టణంలోని రామాలయాన్ని సందర్శించి, బాల కుమార్ నివాసానికి వెళ్లనున్నట్టు తెలిపారు. అలాగే టీటీడీ కళ్యాణమండపంలో జరిగే ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాల్లో పాల్గొనడంతో భువనమ్మ పర్యటన ముగుస్తుందని తెలిపారు. ఈ పర్యటన ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు అన్వేషించడం, మహిళా శక్తిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఉన్నట్లు నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రాజగోపాల్, మొదిలియార్ కుల కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, కడ అడ్వైజరీ కమిటీ నెంబర్ రామచంద్ర, క్లస్టర్ ఇన్ చార్జీలు కన్నన్, శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# షహీద్ దివస్ సందర్భంగా కుప్పంలో పాదయాత్ర

**కుప్పం, మార్చి 22**

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్ల త్యాగాలను స్మరిస్తూ షహీద్ దివస్ పురస్కరించుకుని కుప్పం పట్టణంలో ఆదివారం ఘనంగా పాదయాత్రతో పాటు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు మేరా యువ భారత్ పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా పట్టణంలో పాదయాత్ర చేపట్టి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దేశభక్తి నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. అనంతరం కుప్పం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్టాండ్ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని శ్రమదానం చేశారు. బస్టాండ్ ప్రాంతాన్ని శుభ్రపరచడంలో వారు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో పి కే ఎం వుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, బీజేపీ ప్రతినిధులు తులసినాథ్, వడివేలు, రామచంద్రుడు, వెంకటేష్, జనసేన ప్రతినిధి నరేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మహేష్, సెల్వం, జయరామ్ నాయుడు, డాక్టర్ వరదరాజులు, యువభారత్ అసోసియేషన్ సభ్యులు పరంధామ్, రిషికేశ్ తదితరులు పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నేతలు, సామాజిక సేవా సంస్థలు, విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని దేశభక్తిని, సామాజిక బాధ్యతను చాటుకున్నారు.




# చేనేత కళాకారులకు కూటమి ప్రభుత్వం అండ

- ప్రతి పండుగకు చేనేత వస్త్రాలను కొని కళాకారులకు తోడ్పడాలని పిలుపు
- చేనేతను ఆదరిద్దాం.. మన కళాకారుల కుటుంబాలకు చేయూతనిద్దాం
- నాలుగు రోజుల్లో అమ్మకాలు దాదాపు రూ. 47,35,000
- రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత




**విజయవాడ, మార్చి** రాష్ట్రంలోని చేనేత కళాకారుల అభివృద్ధి, సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. స్థానిక శేషసాయి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న గాంధీ బునకర్ మేళా (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన) -- 2026 ను సాయంత్రం రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత, జౌళి శాఖామాత్యులు శ్రీమతి ఎస్. సవిత సందర్శించారు.. ఈ సందర్భంగా మంత్రి ఎస్. సబిత మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల మేరకు చేనేత రంగానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. చేనేత కార్మికుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సచివాలయంలో, అలాగే తిరుమల బ్రహ్మోత్సవాల సమయంలో చేనేత వస్త్రాల ప్రదర్శనలను ఏర్పాటు చేసి కళాకారుల ఉత్పత్తులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. చేనేత రంగ అభివృద్ధి కోసం ముడి సరుకులపై సబ్సిడీ, నెట్ ఫండ్ అందజేస్తూ, ఆధునిక డిజైన్లపై శిక్షణ అందిస్తున్నామన్నారు. పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీ కల్పించడం ద్వారా కార్మికుల ఉత్పాదకతను పెంచుతున్నామన్నారు.'వన్ డిస్ట్రిక్ట్ -- వన్ ప్రొడక్ట్' పథకం కింద రాష్ట్రానికి వచ్చిన 10 అవార్డులలో 4 అవార్డులు చేనేత రంగానికే దక్కడం విశేషం అన్నారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, చీరాల, పెడన, మాధవరం, మదనపల్లి ప్రాంతాల చేనేత కళాకారులు, దేశవ్యాప్తంగా ఇక్కడ 112 స్టాల్స్ ఏర్పాటు చేస్తే అందులో రాష్ట్రానికి చెందినవి 47 స్టాల్స్ ఉన్నాయన్నారు. ఎన్నికల హామీ మేరకు 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు నెలకు ?4,000 పెన్షన్ అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా ఏప్రిల్ 1 నుండి చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భార్య నారా భువనేశ్వరి, మా మంత్రి నారా లోకేష్ భార్య నారా బ్రాహ్మణి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు చేనేత వస్త్రాలను ధరిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ ప్రతి పండుగకు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఇప్పటి వరకు ఈ ప్రదర్శనలో దాదాపు రూ. 47,35,000/- అమ్మకాలు పైగా మార్చి 18 నుంచి జరిగాయని, త్వరలో అమ్మకాలు రూ. 4 కోట్లకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. నగర ప్రజలు మరింతగా ఈ ప్రదర్శనను ఆదరించాలని, మార్చి 31 వరకు కొనసాగుతుందన్నారు. స్టాక్స్, డిజైన్ల వైవిధ్యం, వినియోగదారుల స్పందన వల్ల అమ్మకాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించారు. స్టాల్స్ ఏర్పాటు చేసిన కళాకారులకు ప్రభుత్వం తరపున ఉచిత విద్యుత్, భోజన వసతి, నివాస సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేనేతలతో పాటు గౌడ, రజక, వడ్డెర వంటి అన్ని బీసీ వర్గాలకు సముచిత గౌరవం, అభివృద్ధి అవకాశాలు కల్పిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.మాజీ జెట్పీ చైర్ పర్సన్ గద్దె అనురాద మాట్లాడుతూ.. భారతదేశ ఆత్మ నూలు పోగులో ఉందని.. ఇదే నూలు పోగు ఈరోజు దేశం మొత్తాన్ని, అన్ని రాష్ట్రాలని కలిపి ఉంచుతోందన్నారు. ఇక్కడ అన్ని రాష్ట్రాల నుంచి కూడా వాళ్ళ ఉత్పత్తులు హ్యాండ్ లూమ్స్ అన్నీ కూడా ఒకే వేదికపై ఏర్పాటు చేశారన్నారు... చేనేత కార్మికులు అనే కంటే చేనేత కళాకారులు వాళ్ళల్లో ఉన్న కళను, సృజనాత్మకతను మొత్తం రంగరించి ఆ నూలు పోగును నేసి వస్త్రాలుగా మనకు అందిస్తారన్నారు. వ్యవసాయం రంగం తర్వాత మనకు ఉపాధి ఎక్కువగా చేనేత రంగం ద్వారానే ఎక్కువగా కలగటం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేతల్ని ఎక్కువగా ప్రోత్సహించటం జరగుతుందని మాజీ జెట్పీ చైర్ పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ గుత్తు రాజారావు, తదతరులు పాల్గొన్నారు.

# ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్ యూనిట్ల ఏర్పాటు చేయాలి

ఆర్‌టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్

**బంగారుపాళ్యం, మార్చి 22**

చిత్తూరు జిల్లాలో ప్రతి మండలంలో ప్రభుత్వ ఖర్చులతో శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు) ఏర్పాటు చేయాలని ఆర్‌టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్నావుల సురేంద్ర డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం ఉదయం 10:30 గంటలకు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆయన తన బృందంతో కలిసి కలవనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, నిల్వ సదుపాయాల లోపం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో పండ్లు, కూరగాయలు వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తులు విస్తృతంగా పండుతున్నాయని, సరైన కోల్డ్ స్టోరేజ్ సదుపాయం లేకపోవడంతో అవి త్వరగా నాశనం అవుతున్నాయని తెలిపారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. శీతల గిడ్డంగుల ఏర్పాటు వల్ల పంటలను ఎక్కువ కాలం భద్రపరచుకోవచ్చని, మార్కెట్ ధరలు అనుకూలంగా ఉన్నప్పుడు విక్రయించే అవకాశం లభిస్తుందని అన్నారు. అలాగే పంటల నష్టం తగ్గి, మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని, రైతుల ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి మండలంలో ఆధునిక కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ చర్యల ద్వారా రైతులు ఆర్థికంగా బలపడటమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తుందని తెలిపారు.



# సంపాదకీయం



## తినే అన్నం మీద విషం చిమ్మడమే...

"ఎంత అమానవీయం! పేదవాళ్ల చదువుల మీద, తినే అన్నం మీద విషం చిమ్మడం. గరికపాటి నరసింహారావు అనే ప్రవచనకర్త, కనీస స్పృహ, విచక్షణ లేకుండా తూలిన ఆ మాటల్లో రెండు ప్రధానమైన విషయాలు ఉన్నాయి.ఒకటి: 'ప్రభుత్వం పుస్తకాలు ఇవ్వడం ఏంటి? యూనిఫామ్‌లు ఇవ్వడం ఏంటి? అన్నం పెట్టడం ఏంటి? చదువు చెప్పాలి కానీ... చదువుకుంటే చదువుకోమనండి, లేకపోతే మానేయమనండి.'రెండవది: 'ఇన్ని సౌకర్యాలు ఇస్తే, మళ్ళీ అందులో బల్లి పడింది, పిల్లి పడింది అని అంటారు..పడవా మరి?'ఈ మాటల్లో సామాజిక అవగాహన, స్పృహ లేవు సరికదా... కనీస మానవత్వం, సహానుభూతి అంతకన్నా లేవు. ఇది మనసులో గూడుకట్టుకుపోయి ఉన్న పేదరికం పట్ల వ్యతిరేక భావజాలానికి నిదర్శనం. ఆకలిని అవమానించడం, బల్లి, పిల్లి పడితే పడనివ్వండి అనడంలో ఆ పసిపిల్లలు బతికితే ఏంటి? లేకపోతే పోతే ఏంటి? అనే చులకనభావం, కర్కశత్వం. ఆకలి రుచి తెలిస్తే మధ్యాహ్న భోజన పథకంలోని ఔన్నత్యం అర్ధమవుతుంది.



వడ్డించిన విస్తరి జీవితాలు గడిపేవారికి ఇది ఎప్పటికీ అర్థం కాదు. ఈ దేశంలో కోట్లాది కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నాయి. అంటే కూడు, గూడు, గుడ్డ అనే కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో ఉన్నారు. ఈ దేశంలో 30 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవించేవారు ఉన్నారు. వీరి కుటుంబాలలో సరైన తిండి లేక, పౌష్టికాహార లోపంతో ఏటా రెండున్నర లక్షల మంది పిల్లలు చనిపోతున్నారు. పేదరికం కారణంగా తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపక, తమతో పాటు కూలిపనులకు తీసుకుపోతున్నారు. యునిసెఫ్, ఎన్.ఎఫ్.హెచ్.ఎస్ నివేదికల ప్రకారం, భారత్ లోని పిల్లలలో 35 శాతం పైగా వయసుకు తగ్గ పొడవు లేరు. 19 శాతం తీవ్ర పోషకాహార లోపంతో వున్నారు. పదవ తరగతి పూర్తయ్యేలోపు పేదవాళ్ల పిల్లలు 12 నుండి 17 శాతం వరకు డ్రాపవుట్ అవుతున్నారు. అయితే మధ్యాహ్న భోజన పథకం వలన డ్రాపవుట్లు తగ్గడమే కాకుండా, హాజరు పది శాతం వరకు పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. పిల్లలు బడికి క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పిల్లల ఆకలి అవసరాలు తీరడమే కాకుండా, పౌష్టికాహార లోపం వలన చనిపోయే పిల్లల శాతం తగ్గింది. తల్లిదండ్రులకు భారం తగ్గి వారి జీవన ప్రమాణాలు కొంత మెరుగవడానికి ఇది దోహదపడుతుంది.ఈ మధ్యాహ్న భోజన పథకం రూపొందించడంలో, అమలు చేయడంలో ఉన్నతమైన ఉద్దేశం, ఇటువంటి విస్తృత ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి.ఆకలితో ఉన్న పిల్లవానికి చదువు చెప్పడం కాదు, ముందు అతని ఆకలి తీర్చాలి. అప్పుడే చదువును ఆకళింపు చేసుకోగలుగుతాడు. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఆరోగ్యవంతమైన తరం తయారు కాగలుగుతుంది. అందరికీ ప్రాథమిక విద్యనందించాలని రాజ్యాంగ సవరణ చేసి, 14 సంవత్సరాల లోపు పిల్లల చదువును 'ప్రాథమిక హక్కు'గా మార్చడంలో ప్రధానమైన ఉద్దేశం ఇదే.ఇన్ని సౌకర్యాలు కల్పిస్తూ పుస్తకాలు, యూనిఫాం, భోజనం పెడితే '...పెళ్లికొడుకుల్లా తయారవుతారు కానీ చదవరు' అనే వెకిలి మాటలు పేదల పట్ల చులకన భావానికి పరాకాష్ట. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో చదివిన పేద పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రొఫెసర్లు, న్యాయమూర్తులు, శాస్త్రవేత్తలు, ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ అధికారులుగా తయారయ్యారు, అవుతున్నారు. దీనికి వందలాది ఉదాహరణలు ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో ఉన్నాయి.నేను ఒక సామాన్యమైన వాడిని. గ్రామీణ ప్రాంతం, పేదరికం నుండి వచ్చిన వాడిని. ప్రభుత్వం ఇచ్చిన మధ్యాహ్న భోజనం, యూనిఫాం సౌకర్యాలు ఉపయోగించుకుని, 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వాడిని. ఈ రోజు నేను ఒక ఐ.పి.ఎస్ ఆఫీసర్ అయ్యాను. నాలాంటివారు ఎన్నో వందల మంది ఈ సదుపాయాలు ఉపయోగించుకుని ఈరోజు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. దీనివలన సమాజంలో ఆర్థిక సామాజిక అసమానతలు తగ్గించడానికి అవకాశం ఉంటుంది.కానీ, గరికపాటి వంటి వారి మాటలను సమర్థించే ఉన్మాద మానసిక స్థితిగల వ్యక్తులు పేదరికాన్ని వెక్కిరిస్తున్నారు. పేదవాడు పేదవాడిగానే మరణించాలి అనే క్రూరమైన ఆలోచనా విధానం వీరిలో కనపడుతుంది. మధ్యాహ్న భోజనం వంటి పథకాలను కేవలం ఖర్చుగా చూడకూడదు. ఇది భవిష్యత్తు మీద ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్)గా చూడాలి. ఇది అక్షర సత్యం. దీనివలన శక్తివంతమైన మానవవనరులను తయారుచేయగలుగుతాం. సమాజంలో అన్ని వర్గాలకు సమానమైన అవకాశాలు దక్కినప్పుడు, కులమతాలకు అతీతంగా ప్రతి పేదకుటుంబం ఎదిగినప్పుడు శక్తివంతమైన భారతదేశం తయారవుతుంది.ఇప్పటికే విద్యారంగంలో తీవ్రమైన అసమానతలు ఉన్నాయి. ధనవంతులకు ఇంటర్నేషనల్, కార్పొరేట్ స్కూళ్ల ద్వారా ఆధునిక, నాణ్యమైన విద్య అందుబాటులో ఉంది. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలలోని పేద పిల్లలు వారితో పోటీ పడగలగాలి. అందుకు ఇటువంటి కనీస సౌకర్యాలు చాలా అవసరం. పేదవాడి విద్యపై చేసే ఇటువంటి అహంకారపూరిత వ్యాఖ్యానాలను కేవలం వ్యక్తిగతంగా చూడకూడదు. అభ్యుదయవాదులు, మానవతావాదులు వీటిని ఖండించాలి. లేకపోతే అబద్ధమే నిజమని నమ్మే ప్రమాదం ఉంది. ఒక నిజాన్ని బతికించాలంటే, దానికి సంబంధించిన అబద్ధాన్ని అంతం చేయాలి. సత్యమేవ జయతే.



## చలివేంద్రాన్ని ప్రారంభించిన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి

**గన్నవరం, మార్చి 22**

కృష్ణాజిల్లా, గన్నవరం మండలం లో ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో బీజేపీ గన్నవరం మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సామాజిక బాధ్యతగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణికులకు, బాటసారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల మోహన్ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కానూరు శేషు మాధవి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి, కురమద్దాల ఫణి కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నే హరి కృష్ణ టీడీపీ క్లస్టర్ ఇంచార్జి, రామకృష్ణ జనసేన నాయకులు, మేడూరి శేష్ బాబు, వెంకట కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి, ఈ కార్యక్రమంలో పాము సిద్దు, కోటేశ్వరరావుతో పాటు కూటమికి చెందిన పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం చేనేత కార్మికుడి పాదయాత్ర ప్రారంభం



**జగ్గయ్యపేట, మార్చి 22**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు "భారతరత్న" అవార్డు సాధించాలనే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు బి.ఎల్. నర్సింహులు పాదయాత్రను ప్రారంభించారు. ఎన్టీఆర్ జన్మస్థలం నిమ్మకూరులోని ఆయన దంపతుల విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర పలు ప్రాంతాల మీదుగా కొనసాగుతూ జగ్గయ్యపేట పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా నర్సింహులు జగ్గయ్యపేట శాసనసభ్యుడు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ఆయన దీక్ష, పట్టుదలను అభినందిస్తూ పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇందుగుపల్లి ఎంపీటీసీ చావా నాగేశ్వరరావు, వేదాద్రి మాజీ సర్పంచ్ పసుమర్తి జగజ్జీవన్ రామ్, బడే నాగేశ్వరరావు, కన్నా రవి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి దేవస్థానాన్ని సందర్శించిన వారాహి పీఠాధిపతి

**జగ్గయ్యపేట, మార్చి 22**



జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని నైమిశారణ్య శ్రీ వారాహి పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ ఆదివారం ఉదయం సందర్శించారు. ఉదయం 10:30 గంటలకు ఆలయానికి విచ్చేసిన స్వామీజీకి ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విశిష్టత, ఆలయ ప్రాముఖ్యతపై భక్తులకు విపులంగా వివరించారు. స్వామీజీ ప్రవచనాలను భక్తులు ఆసక్తిగా ఆలకించి ఆనందం వ్యక్తం చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి నూతక్కి సాంబశివరావు తెలిపారు.

## గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా జొన్నభట్ల కిషోర్ శర్మ ఎన్నిక



**జగ్గయ్యపేట, మార్చి 22**

జగ్గయ్యపేట గాయత్రి బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షునిగా జొన్నభట్ల కిషోర్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని గాయత్రి కళ్యాణ మండపంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా పల్లెకున కేశవ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మాడపాటి కిషోర్, కోశాధికారిగా మంగు చైతన్య శర్మ తదితర కార్యవర్గ సభ్యులను కూడా సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను సంఘ న్యాయ సలహాదారు, ప్రముఖ న్యాయవాది ఈశ్వర వెంకట జగన్నాథరావు పర్యవేక్షించారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కిషోర్ శర్మకు సంఘ సభ్యులు, బ్రాహ్మణ ప్రముఖులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, జగ్గయ్యపేటతో పాటు పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సేవలు అందిస్తానని తెలిపారు. ఇదే కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన పూర్వ అధ్యక్షుడు కలవకొలను వీరాంజనేయ శర్మకు సంఘ సభ్యులు సత్కారం నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా సంఘాన్ని సమర్థంగా నడిపిస్తూ గాయత్రి కళ్యాణ మండపం నిర్మాణంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు పిల్లల మర్రి నాగకృష్ణ శర్మ, కీసర రాంబాబు, బాచినప్ప కోటేశ్వరరావు, మాదిరాజు కేశవరావు, మహిళా ప్రతినిధులు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పైప్డ్ గ్యాస్.. సురక్షితం, సౌకర్యవంతం

- పీఎన్‌జీ కనెక్షన్ దిశగా ప్రజలు దృష్టిసారించాలి
- ముందు జాగ్రత్తగా వినియోగానికి ముందుకు రావాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మార్చి 22**

ప్రస్తుతం ఎల్‌పీజీ వంట గ్యాస్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని, అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా ప్రజలు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వినియోగం వైపు మళ్లాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. కలెక్టర్ లక్ష్మీశ.. ఆదివారం క్యాంపు కార్యాలయంలో భాగ్యనగర్ గ్యాస్, మేఘా గ్యాస్ ప్రతినిధులతో సమావేశం అనంతరం సిద్ధార్థ నగర్ ఎస్‌బీఐ కాలనీలోని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ రెగ్యులేటింగ్ స్టేషన్ ను సందర్శించారు. కుళాయి నీటి తరహాలో పైపుల ద్వారా ఇంటింటికీ నేచురల్ గ్యాస్ సరఫరా విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 9 వేలు మాత్రమే పీఎన్‌జీ కనెక్షన్లు ఉన్నాయని.. లక్ష వరకు కనెక్షన్లు ఇవ్వగల సామర్థ్యం ఇప్పుడు ఉందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక భద్రతతో నిరంతర గ్యాస్ సరఫరాకు ఈ కనెక్షన్లు వీలుకల్పిస్తాయన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు లేదా సంక్షోభ పరిస్థితులు ఎదురైనా గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు పీఎన్‌జీ ఉత్తమ ప్రత్యామ్నాయమని తెలిపారు. గృహాలకు నేరుగా పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందుబాటులో ఉండటం వల్ల సురక్షితం గా, సౌకర్యవంతంగా ఉపయోగిం చుకో వచ్చని చెప్పారు. 21 మిల్లీబార్ పీడనంతో సరఫరా అనేది సురక్షిత మైనదని.. అందువల్ల ఇలాంటి సురక్షితమైన వంట గ్యాస్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే చాలా హోటళ్లు పీఎన్‌జీ ఉపయోగిస్తున్నాయని.. మిగిలి నవి కూడా పీఎన్‌జీ దిశగా ఆలోచిం చాలని కోరారు. జిల్లాలో ఎవరికైనా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్ కావాల నుకుంటే కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454) నంబరుకు కాల్ చేయొచ్చని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గృహాలు, హోటళ్లు, పారిశ్రామిక యూనిట్లు తదితరాలకు సురక్షితమైన, నిరంతర గ్యాస్ సరఫరా అందించేలా పీఎన్‌జీ కనెక్షన్లకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. పీఎన్‌జీ ప్రయోజనాలతో పాటు పూర్తి వివరాలను ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న సిబ్బంది వివరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

# రెండో ఎస్‌టీపీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

- వీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు



**విజయవాడ, మార్చి**

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. జి. లక్ష్మీశ ఆదివారం విజయవాడ రామలింగేశ్వర నగర్‌లోని 20 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్‌టీపీ)ని సందర్శించారు. మురుగునీటి శుద్ధి ప్రక్రియ, వినియోగంలో ఉన్న సాంకేతిక విధానాలు, నిర్వహణ తీరు వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ సామర్థ్యానికి అనుగుణంగా శుద్ధి జరుగుతోందా లేదా అన్న దానిపై సమగ్రంగా సమీక్షించారు. అదేవిధంగా కొత్తగా ఏర్పాటుచేస్తున్న మరో 20 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న ప్లాంటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పెరుగుతున్న నగర విస్తీర్ణం, జనాభాను దృష్టిలో ఉంచుకుని మురుగునీటి శుద్ధి అత్యంత కీలకమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎస్‌టీపీ సామర్థ్యానికి తోడు నిర్మాణంలో ఉన్న రెండో ఎస్‌టీపీ పనులను త్వరిత గతిన పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశిం చారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ దశలో సాంకేతిక ప్రమాణాలు పాటిస్తూ, పర్యావరణ పరిరక్షణకు అనుగు ణంగా పనులు కొనసాగించాలన్నారు. ఈ పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ సీఈ పి.సత్యకుమారి ఉన్నారు.

### మాజీ డ్రైవర్ కుటుంబంపై

# ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఆత్మీయత



**గన్నవరం, మార్చి 22**

కృష్ణా జిల్లా, గన్నవరం నియోజకవర్గం, తన ఎదుగుదలలో తోడున్న వారిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఎన్నడూ మరువరని మరోసారి నిరూపితమైంది. నిడమానూరు పర్యటన ముగించుకుని వస్తుండగా, రోడ్డుపై తన మాజీ డ్రైవర్ జూటూరి సురేష్ కుటుంబాన్ని గమనించిన ఎమ్మెల్యే, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపి వారితో ముచ్చటించారు. ప్రోటోకాల్ ఆడంబరాలు పక్కన పెట్టి, రోడ్డు పక్కనే సురేష్ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. సురేష్ కుమార్తెల చదువుల గురించి అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. పదవులు శాశ్వతం కాదని, నమ్మకంగా పనిచేసిన వ్యక్తులు మరియు ఆత్మీయ సంబంధాలే ముఖ్యం అని యార్లగడ్డ పేర్కొన్నారు. ఎమ్మెల్యే హోదాలో ఉండి కూడా తన పాత సిబ్బందిని గుర్తుంచుకుని పలకరించడంపై స్థానికులు మరియు సురేష్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# రూ.1.5 కోట్ల అభివృద్ధి పనులు

- ప్రగతి పథంలో బొమ్మసముద్రం




**ఐరాల, మార్చి 22**

పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాల మండలం బొమ్మసముద్రం గ్రామం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసి కూటమి ప్రభుత్వం గ్రామానికి కొత్త రూపు తీసుకువచ్చింది. ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో గోకులం షెడ్లు, చెరువు మొరవ కల్వర్టుల మరమ్మతులు, ఆరోగ్య కేంద్రం, ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడ, కొత్త పాఠశాల భవనాలు, సిమెంట్ రోడ్లు, దళితవాడలో కమ్యూనిటీ హాళ్లను వారు ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బాణాసంచా, మంగళవాయిద్యాలతో వారిని ఆహ్వానించి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడిన వారు, అభివృద్ధి మరియు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహంతో నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. బొమ్మసముద్రం పంచాయతీ అభివృద్ధి పనులతో మోడల్ గ్రామంగా మారడం ఆనందదాయకమని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేయకుండా అభివృద్ధిని గుర్తించాలని సూచించారు.

# యుద్ధ ప్రభావాలపై ముందస్తు కార్యాచరణ అవసరం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర వైస్ చైర్మన్, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు



**జగ్గయ్యపేట, మార్చి 22 (**

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ధరల పెరుగుదలపై మాత్రమే స్పందించడం సరిపోదని, పశ్చిమ ఆసియా యుద్ధ పరిణామాల నేపథ్యంలో రాబోయే ఆర్థిక, సామాజిక ప్రభావాలపై ముందుగానే సమగ్ర కార్యాచరణ రూపొందించడం అత్యవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర వైస్ చైర్మన్, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం జగ్గయ్యపేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధ ప్రభావం కేవలం ఇంధన ధరల పెరుగుదలతో మాత్రమే పరిమితం కాకుండా, ఆహార భద్రత, ఔషధాల లభ్యత, రవాణా వ్యవస్థ, సరఫరా గొలుసుపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ముందస్తు ప్రణాళిక లేకపోతే సామాన్య ప్రజలే ఎక్కువగా నష్టపోయే పరిస్థితులు తలెత్తవచ్చని తెలిపారు. ప్రభుత్వం అత్యవసర వస్తువుల నిల్వలను సమీక్షించి, బఫర్ స్టాక్‌లను పెంచాలని, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ధరల పర్యవేక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, హోర్డింగ్, బ్లాక్ మార్కెటింగ్ వంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అపోహలు సృష్టించకుండా ప్రజలకు నిజమైన సమాచారం అందించాలని సూచించారు. వినియోగదారులు అవసరమైన వస్తువులనే వినియోగిస్తూ అనవసరంగా నిల్వలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మేధావులు, విధాన నిర్ణేతలు, ప్రజా ప్రతినిధులు కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కాదు, ముందే సిద్ధం కావడం సమాజ బలం" అని కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు.

# న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి

- తరాలు తిరిగినా న్యాయం జరగదనే అభిప్రాయం మార్చాలి
- హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రాజశేఖర్



**ఎస్.కోట రూరల్, మార్చి 22**

'న్యాయవ్యవస్థ అంటే తరాలు తిరిగినా న్యాయం జరగదన్న అభిప్రాయం నేటి సమాజంలో ఉంది. ఈ అపవాదును తొలగించేందుకు న్యాయాధికారులు, న్యాయవాదులు చిత్తశుద్ధితో పనిచేయాలి. న్యాయ వ్యవస్థపై ప్రజల్లో పూర్తి నమ్మకం కలిగించాలి. హడావుడిగా తీర్పులు ఇస్తే మళ్లీ కోర్టుల్లో కేసులు పడతాయి' అని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తర్లాడ రాజశేఖర్ అన్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో రూ.8 కోట్లతో నిర్మించనున్న కోర్టు భవన నిర్మాణ పనులకు వారు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఓ ప్రైవేటు హాల్‌లో జరిగిన సమావేశంలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ.. కోర్టు బెంచ్, బార్ సమన్వయంతో పనిచేస్తే మంచి తీర్పులు వస్తాయన్నారు. కొన్ని సివిల్ కేసులు 40 ఏళ్లకు పైబడి పెండింగ్ ఉన్నట్లు గుర్తించామని, దీని వల్ల కోర్టుల చుట్టూ ఏళ్ల పాటు తిరిగినా న్యాయం జరగదన్న అపవాదు మిగిలిందని పేర్కొన్నారు. కోర్టులు, సిబ్బంది, ఉద్యోగులు ఉన్నా ఎందుకు సకాలంలో తీర్పులు ఇవ్వలేకపోతున్నామనే దానిపై ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లతో అద్భుత ఫలితాలు సాధించామని, తొలి విడత 3 లక్షల కేసులు, రెండో విడత మరో 3 లక్షల కేసులు పరిష్కరించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి, అందరిలో స్ఫూర్తి నింపిందన్నారు. ప్రస్తుతం 'మీడియేషన్'పై దృష్టి పెడుతూ శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా కేసులను రాజీ చేసేందుకు వేగవంతమైన ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తనకు ఉత్తరాంధ్ర అంటే మమకారం ఎక్కువ అని అన్నారు. జస్టిస్ రాజశేఖర్ మాట్లాడుతూ.. జడ్జీలు కేసులను క్లియర్ చేసే హడావుడిలో సరైన నిర్ణయాలు తీసుకోకుండా తీర్పులు ఇస్తున్నారని, దీని వల్ల ఆ కేసులు మళ్లీ కోర్టుకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేసుల క్లియరెన్స్‌లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా న్యాయాధికారి ఎం.బబిత మట్లాడుతూ.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అందిస్తున్న సహకారం మరువలేమన్నారు. గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ.. ఉన్నత స్థాయికి ఎదిగిన కొందరు వ్యక్తులు తాము పుట్టిన ప్రాంతానికి, ఊరి కోసం పనిచేస్తారని అలాంటి వారిలో మానవేంద్రనాథ్ రాయ్ ఒకరని కొనియాడారు. అన్ని జిల్లాల న్యాయాధికారులకు సలహాలు, సూచనలు అందించి నడిపిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట న్యాయాధికారి కనకలక్ష్మి, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరిదేముడు, పలువురు న్యాయాధికారులు పాల్గొన్నారు.

## నేడు పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 22**



ఈ నెల 23వ తేదీ సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం ... పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిం చనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపడుతు న్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసి పల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందు బాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా డివిజనల్, మండలస్థాయిలో రెవెన్యూ క్లినిక్ లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు తమ రెవెన్యూ అర్జీలను ఈ క్లినిక్‌లలో అందజేయాలని సూచించారు. అర్జీదారులు తమ అర్జీలను వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



## 240 చోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

### నెల్లూరు రూరల్‌లో ఏకకాలంలో ప్రారంభించిన కూటమి నేతలు

**నెల్లూరురూరల్, మార్చి 22**

నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ఏకకాలంలో 240చోట్ల అభివృద్ధి పనులకు ఆదివారం కూటమి నాయకులు ప్రారంభోత్సవం చేశారు. ఇందులో భాగంగా నెల్లూరు పరిధిలోని పడారుపల్లి వద్ద సీసీరోడ్లు, డ్రెయిన్లకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ సుజాత ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల వద్దనున్న పారిశ్రామిక వాడకు త్వరలో ఓ పరిశ్రమ రాబోతున్నట్లు ఈసందర్భంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, నెల్లూరు నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నాయకులు సుజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే రూరల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానికంగా ఉండే టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, స్థానికుల నేతృత్వంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు వేడుకగా జరిగాయి.



## చంద్రబాబు మరోసారి సీఎం అయితేనే భవిష్యత్తు

- వైసీపీ పాలనలో ఫైట్ చేసిన జన సైనికులను కలుపుకొని వెళ్లాలి
- బీజేపీ మద్దతుతోనే అభివృద్ధి పరుగు
- 'ఒక్క చాన్స్' అన్న జగన్ రాష్ట్రాన్ని అన్నివిధాలా 20 ఏళ్లు వెనక్కి నెట్టాడు
- సర్పంచ్‌ల సన్మాన సభలో మంత్రి కొండపల్లి

"ప్రస్తుత సీఎం చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం చేపట్టిన పనులు ముందుకు సాగుతాయి. కూటమిలోని మూడు పార్టీలూ కలిసికట్టుగా ఉంటేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుంది." అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గంలోని నెలివాడ గ్రామంలో వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్న టీడీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లకు మంత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ నేత జగన్ అధికారంలో ఉన్నప్పుడు జనసైనికులు ధైర్యంగా ముందుకొచ్చి నాటి ప్రభుత్వ అరాచకాలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. వారి సేవలను గుర్తుంచుకొని వారిని కలుపుకొని ముందుకు వెళ్లాలని టీడీపీ కేడర్‌కు సూచించారు. బీజేపీ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. కూటమి పార్టీలు ఐక్యంగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమైనా మరోసారి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నారు. 'ఒక్క చాన్స్' అని పేదలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్.. రాష్ట్రాన్ని అన్ని విధాలా 20 ఏళ్లు వెనక్కు నెట్టారని విమర్శించారు. సెర్ప్ డిపార్ట్‌మెంట్‌కు గత ప్రభుత్వం కేవలం రూ.300 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించిందన్నారు. ఈ నిధులను పూర్తిగా వినియోగిస్తే వచ్చే బడ్జెట్‌లో మరింతగా నిధులు పెంచుతామని తెలిపారు. వైసీపీ అధినేత 2019–24 మధ్య పేదలు, ప్రజల కోసం పని చేయలేదని, వారి వ్యాపారాలు, వ్యక్తిగత అవసరాల కోసం పాలన సాగించారని విమర్శించారు. ఈ విషయం వైసీపీ నేతలకు కూడా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండపల్లి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు

# లక్షన్నర కోట్లతో ఆర్సెలార్ ఉక్కు!

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు హెచ్‌డీ కుమారస్వామి, కింజరాపు రామ్మోహ న్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖ ర్‌తోపాటు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలైన ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీలు (ఏఎంఎన్ఎస్) ఈ భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నాయి. 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభించి.. 2033 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ పరిశ్రమ ద్వారా 1.25 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని అంచ నా. 2,164 ఎకరాల్లో రెండు దశల్లో దీనిని నిర్మిస్తారు. తొలి దశలో 7.3 మిలియన్ టన్నులు, రెండో విడతగా 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పనులు చేపడతారు. ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా బుచ్చిరాజుపేటలో 102.18 ఎకరాలు, చందనాడలో 840.2 ఎకరాలు, డీఎల్ పురం లో 674.39 ఎకరాలు, రాజయ్యపేటలో 36.62 ఎకరాలు, వేంపాడులో 510.92 ఎకరాలను ఈ ఉక్కు కర్మాగారానికి కేటాయించింది.

**పారిశ్రామిక హబ్‌గా ఉత్తరాంధ్ర: కలిశెట్టి**

వైసీపీ పాలనలో ఉత్తుత్తి ఆంధ్రగా మారి విధ్వంసానికి గురైన ఉత్తరాంధ్ర.. నేడు చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని టీడీపీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు కూడా పూర్తికాక ముందే ఉత్తరాంధ్రను పారిశ్రామిక హబ్‌గా మార్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే జూన్‌కల్లా ప్రారంభమవుతుందన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెండు కళ్లు వంటివని తెలిపారు. జగన్ హయాంలో ఈ ప్రాంత వనరులను దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్రం బాగుపడడం ఇష్టం లేని మాజీ సీఎం.. పరిశ్రమలపై దుష్ప్రచారం చేస్తున్నారని.. ఇలాంటి వ్యక్తులను ప్రజలు సామాజికంగా బహిష్కరించాలని పిలుపిచ్చారు.

## డిజిటల్ కమ్యూనికేషన్‌లో 'స్వదేశీ' విప్లవం షురూ!

**న్యూఢిల్లీ, మార్చి 22**

ఇప్పటి వరకు విదేశీ కమ్యూనికేషన్ వేదికలపై ఆధార పడ్డ 80 కోట్ల మంది భారతీయులకు అత్యంత సురక్షితమైన స్వదేశీ ప్రత్యామ్నాయం సిద్ధం చేశామని న్యూఢిల్లీలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర్ స్ఫూర్తితో తమ సంస్థ రెండు అద్భుతమైన అప్లికేషన్లను రూపొందించిందన్నారు. 'హైప్డ్ సంవాదిని' మెసెంజర్, 'దేశీ ఏఐ జెన్‌జీ కీబోర్డ్ 'లను ఆవిష్కరించి, వాటి పనితీరును చంద్రశేఖర్ వివరించారు. వీటి సాయంతో డిజిటల్ అరెస్టులు, ఉద్యోగాల పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీలను వీటితో అరికట్టవచ్చని తెలిపారు. విదేశీ యాప్‌ల్లో డేటా గోప్యత ప్రశ్నార్థకంగా మారుతోందన్న చంద్రశేఖర్.. తమ యాప్‌లతో పౌరుల వ్యక్తిగత సమాచారానికి రక్షణ కల్పిస్తున్నామన్నారు. ఇవి కేవలం కమ్యూనికేషన్ సాధనాలు మాత్రమే కాదని, జాతీయ భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. హైప్డ్ సంవాదినితో 22 భారతీయ భాషల్లో రియల్ టైమ్ అనువాదం చేయనున్నట్లు తెలిపారు. ఈ యాప్‌లతో సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక రక్షణ కల్పిస్తున్నామన్నారు.

# ఆకాశాన్నంటుతున్న చికెన్ ధరలు

**విజయవాడ, మార్చి 22**



రాష్ట్రంలో చికెన్ ధరలు మండిపోతున్నాయి. ఆదివారం కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ400కు చేరింది. బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదకత తగ్గడం, రంజాన్ మాసం, ఫంక్షన్ల కారణంగా చికెన్‌కు ఊహించని డిమాండ్ ఏర్పడింది. దీంతో చికెన్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. ఈ నెల 1వ తేదీన 340 (స్కిన్), 350 (స్కిన్‌లెస్)గా ఉన్న ధర.. ఆ తర్వాత నుంచి వేగంగా పెరుగుతూ వచ్చింది. గత ఆదివారం (మార్చి 15) కూడా 370 (స్కిన్), 380 (స్కిన్‌లెస్) పలికింది. కృత్రిమ కొరత సృష్టించి దండుకోవడానికి అసోసియేషన్ వేసిన ప్లాన్ ఇదని వినియోగదారులు ఆరోపిస్తుండగా.. అలాంటిదే మీ లేదని ఉత్పాదకత లేక ధరలు పెరిగాయని అసోసియేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ చికెన్ ధరలు గణనీయంగా పెరిగాయి. నెల క్రితం కిలో రూ.300లోపు ఉన్న చిన్న బ్రాయిలర్ వారానికి రూ.20చొప్పున పెరుగుతూ వచ్చి ఆదివారం ఏకంగా రూ.400 (స్కిన్‌లెస్)కు చేరుకుంది. విత్ స్కిన్ (డ్రెస్సడ్) ధర రూ.390 పలికింది. డిమాండ్‌కు సరిపడా చిన్న బ్రాయిలర్ కోళ్లు లభించకపోవడమే ధరల పెరుగుదలకు కారణమని చికెన్ దుకాణాల నిర్వాహకులు అంటున్నారు. ఆదివారం పెద్ద బ్రాయిలర్ కూడా కిలో రూ.300 పలికింది. చికెన్ ధర రూ.400కు చేరడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. దీంతో చికెన్ అమ్మకాలు కూడా తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. కోళ్ల ఫారం నిర్వాహకులు పిల్లల పెంపకం ఆపేడయంతో పాటు ఫారంలో పెంచుతున్న కోళు పెద్దఎత్తున మృతి చెందుతున్నాయి. దీంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక రేటు అమాంతం పెరిగిపోయింది. జంగారెడ్డిగూడెం, రాజమండ్రి ప్రాంతాల నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాకు కోళ్లు వచ్చేవి. అయితే ఆ ప్రాంతాల్లో కోళ్ల ఉత్పత్తి లేక విశాఖపట్నం, తెలంగాణ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో ధరలు పెరిగాయి. వేసవి రావడంతో వ్యాపారులు కోళ్ల పెంపకాన్ని తగ్గించేశారు. ఫారాల్లో వంద కోళ్ల ఉత్పత్తి రావాల్సిన చోట 40, 50 కోళ్లు మాత్రమే వస్తున్నాయని, ఎండ తీవ్రతకు కొన్ని చనిపోతున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు రంజాన్ మాసంలో హలీం, ఇతర మాంసాహార వంటల కోసం పెద్ద ఎత్తున సరఫరా జరిగింది. ఆ స్థాయిలో ఉత్పాదకత లేకపోవడంతో కోళ్లకు కొరత వచ్చింది.ఓ వైపు చికెన్ ధరలు ఆకాశాన్నంటుతుంటే.. కోడి గుడ్డు ధర మాత్రం పడిపోతోతూ వస్తోంది. మొన్నటి వరకు రూ.8 అమ్మిన కోడిగుడ్డు ధర పతనమై రూ.4.65కు చేరింది. దీంతో సాధారణ పౌల్ట్రీ యజమానులు విలవిల్లాడుతున్నారు. కోడిగుడ్లు ఎక్స్‌పోర్టు లేకపోవడంతో ధరలు పడిపోయాయి. తమిళనాడుకు ఎక్కువగా ఎగుమతి అవుతాయి. అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం యుద్ధం కారణంగా గల్ఫ్‌కు ఎగుమతులు జరగట్లేదు.

## కుప్పంలో త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ ఆవిష్కరణ

**కుప్పం, మార్చి 22 (**



చిత్తూరు జిల్లా కుప్పం పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి -- ఇందూ జ్ఞాన వేదిక కుప్పం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ (త్రైతశకం - 48) ను ఘనంగా పంపిణీ చేశారు. త్రిమత ఏకైక గురువు, ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తి శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో రూపొందించిన ఈ కాలసూచికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, తూర్పు పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ తెలుగు కాలసూచికలో భగవద్గీత వచనాలను సమగ్రంగా చేర్చి, ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యే విధంగా రూపొందించడం విశేషమన్నారు. ఇందులో ఆత్మజ్ఞానం, దేవాలయ సంప్రదాయాలు, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల ప్రాముఖ్యతతో పాటు భగవద్గీత శ్లోకాల సారాంశం ద్వారా జీవన సమస్యలకు పరిష్కార మార్గాలను పొందుపరిచినట్లు తెలిపారు. అలాగే తెలుగు తిథులతో పాటు ఆంగ్ల తేదీలను కూడా సమన్వయంతో చేర్చి ప్రజలకు ఉపయోగకరంగా రూపొందించిన ఈ కాలసూచికను అందించడం హర్షించదగ్గ విషయమని అభినందించారు. అనంతరం ఈ క్యాలెండర్లను 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము, నాయకులు సురేష్, ఆర్యవైశ్య కుల సంఘము నాయకులు మంజు తదితరులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కుప్పం కమిటీ అధ్యక్షులు కృష్ణ, సభ్యులు దేవరాజు, నాగరాజు, ప్రకాష్, కృష్ణారెడ్డి, సర్వనా, లోకేష్, చరణ్, శశాంక్, రాధా, ఇందిరా, వెంకటలక్ష్మి, బిందు తదితరులు పాల్గొన్నారు.





### ఉద్యోగులకు ఏఐ ట్రైనింగ్..

## పియర్సన్‌తో టీసీఎస్ జట్టు

ముంబై: గ్లోబల్ లెర్నింగ్ సర్వీసుల సంస్థ పియర్సన్‌తో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) జట్టు కట్టింది. కృత్రిమ మేథతో సిబ్బందికి శిక్షణనిచ్చి, వారిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడంలో కంపెనీలకు తోడ్పాటు అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. ఇందుకోసం ఇరు సంస్థలు ఏఐ ఆధారిత లెర్నింగ్ ప్రోడక్టులు, సర్వీసులను రూపొందిస్తాయి.నియామకాల్లో, సిబ్బంది అభివృద్ధి ప్రోగ్రాంలలో అభ్యర్థుల సామర్థ్యాలను మదింపు చేసే ప్రక్రియలో పియర్సన్‌కి చెందిన వెర్సాంట్ ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ విధానాన్ని టీసీఎస్ ఉపయోగించనుంది. మరోవైపు అంతర్జాతీయ ట్రావెల్ సర్వీసులను డిజిటలీకరించే దిశగా ప్రముఖ ట్రావెల్ టెక్నాలజీ సంస్థ అమెడ్యూస్‌తో టీసీఎస్ చేతులు కలిపింది.మరోవైపు, ఐటీ ఇన్‌ఫ్రా, డేటా సెంటర్లు, ఇతరత్రా టెక్నాలజీల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా ఆటోమేషన్ దిగ్గజం ఏబీబీ, టీసీఎస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

## స్కోడా కుషాక్ ఫేస్‌లిఫ్ట్ వచ్చేసింది: ధర ఎంతంటే?




స్కోడా కంపెనీ.. అప్‌డేటెడ్ కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను భారతదేశంలో లాంచ్ చేసింది. దీని ధరలు రూ. 10.69 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతాయి. ఈ లేటెస్ట్ మిడ్-సైజ్ ఎస్యూవీ డిజైన్, ఫీచర్లు, పవర్‌ట్రెయిన్ ఆప్షన్‌లలో గణనీయమైన అప్‌గ్రేడ్‌లను పొందింది. అదే సమయంలో కంపెనీ సేఫ్టీకి కూడా ప్రాధాన్యత కల్పించింది.హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, ఫోక్స్‌వ్యాగన్ టైగన్, మారుతి సుజుకి గ్రాండ్ విటారా, హోండా ఎలివేట్ వంటి వాటికి ప్రత్యర్థిగా ఉండే.. కుషాక్ ఫేస్‌లిఫ్ట్.. క్లాసిక్ ప్లస్, సిగ్నేచర్, స్పోర్ట్‌లైన్, ప్రెస్టీజ్, మాంటే కార్లో అనే ఐదు ట్రిమ్‌లలో 1.0 , 1.5 టర్బో పెట్రోల్ ఇంజన్‌లతో లభిస్తుంది.కుషాక్ ఫేస్‌లిఫ్ట్ 5-స్టార్ గ్లోబల్ చీజూరా సేఫ్టీ రేటింగ్ కూడా పొందింది. అన్ని వేరియంట్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్, హిల్-హోల్డ్ అసిస్ట్, ఐసోఫిక్స్ మౌంట్‌లు వంటి అనేక ఫీచర్లు ఉన్నాయి.మెకానికల్ పరంగా.. అతిపెద్ద అప్‌డేట్ ఏమిటంటే, మునుపటి 6-స్పీడ్ యూనిట్ స్థానంలో 1.0-లీటర్ ఇంజిన్‌తో కొత్త 8-స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌ను ప్రవేశపెట్టడం.

### యుద్ధ సవాళ్ల మధ్య నిలకడగా

# రాణిస్తున్న మెటల్, ఫార్మా రంగాలు!

**దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారమూ ఆటోపోట్లకు లోనయ్యే అవకాశముంది. వెస్ట్ ఏషియాలో యుద్ధం సద్దుమణిగేంత వరకు మదుపరులు అప్రమత్తంగా ఉండటమే మంచిది. క్రూడాయిల్ ధరలు చల్లబడే వరకూ ఇదే పరిస్థితి కొనసాగనుంది. ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్న విలువైన షేర్లను కొనుగోలు చేసుకొనే వ్యూహం అవలంబించొచ్చు. క్రితంవారం ఆటో, మెటల్, పీఎస్యూ బ్యాంకు, కమోడిటీస్ రంగాల షేర్లు కొంత బలం ప్రదర్శించాయి.**




**జిందాల్ స్టీల్:**

నిరుడు మార్చి నుంచి ఈ షేర్లు అప్‌ట్రెండులో కొనసాగుతున్నాయి. 50 శాతానికి పైగా రాబడి అందించాయి. చివరి 15 సెషన్లలో 12 శాతం దిద్దుబాటుకు లోనైనా రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉండటం గమనార్హం. గత శుక్రవారం 4.30 శాతం లాభంతో రూ.1186 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1250టార్గెట్ ధరతో రూ.1180 శ్రేణిలో ప్రవేశించాలి. రూ.1150 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

**లారస్ ల్యాబ్స్:**

రెండేళ్లుగా ఈ షేర్లు బుల్ రన్ కొనసాగిస్తున్నాయి. తాజా మార్కెట్ పరిస్థితుల్లో 17 శాతం మేర దిద్దుబాటుకు లోనయ్యాయి. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ పెరుగుతుండటం సానుకూల అంశాలు. గత శుక్రవారం 4.47 శాతం లాభంతో రూ.987 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1050/1100 టార్గెట్ ధరతో రూ.980 శ్రేణిలో ప్రవేశించాలి. రూ.950 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.

**గ్లెన్‌మార్క్:**

నిరుడు జులైలో జీవితకాల గరిష్ఠానికి చేరిన ఈ షేర్లలో దిద్దుబాటు పూర్తయింది. ఆరునెలలుగా చక్కని బేస్ ఏర్పడింది. కప్ హ్యాండిల్ ఫార్మేషన్ కనిపిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవరాం 4 శాతం లాభంతో రూ.2180 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.2250 టార్గెట్‌తో రూ.2160 స్థాయుల్లో ప్రవేశించాలి. రూ.2120 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.

**సెయిల్:**

గతేడాది జనవరి నుంచి ఈ షేర్లు 60% రాబడినందించాయి. మల్టీఇయర్ బ్రేకౌటుకు సిద్ధమవుతున్నాయి. రూ.170 వద్ద నిరోధాన్ని దాటేస్తే తిరుగుండదు. గత శుక్రవారం రూ.155 వద్ద ముగిసిన ఈ షేర్లను మదుపరులు రూ.170 టార్గెట్‌తో రూ.155 స్థాయిలో కొనుగోలు చేయాలి. రూ.152వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.


**కెనరా బ్యాంకు:**

నిరుడు మార్చి నుంచి అప్ ట్రెండులో కొనసాగుతున్న ఈ షేర్లు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠాన్ని సమీపంలో కదలాడుతున్నాయి. మూమెంటమ్ లభిస్తే దానిని అధిగమించి మరింత ముందుకు సాగే అవకాశముంది. గరిష్ఠ స్థాయుల్లో అక్యూములేషన్ కొనసాగుతోంది. తాజా పరిస్థితుల్లో 20 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. గత శుక్రవారం రూ.136 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.155 టార్గెట్ ధరతో రూ.136పై స్థాయిలో ప్రవేశించాలి. రూ.136 వద్ద స్టాప్ లాస్ పెట్టుకోవాలి.



మూర్తినాయుడు పాదం
నిఫ్టీ మాస్టర్, స్టాక్ మార్కెట్ అనలిస్ట్
988 555 9709

# పిఎస్ఎల్‌కు పశ్చిమాసియా దెబ్బ!




న్యూఢిల్లీ : పశ్చిమాసియా యుద్ధవాతావరణం పాకిస్తాన్ సూపర్ లీగ్ పిఎస్ఎల్)పై ప్రభావం చూపిస్తోంది. హోర్మూజ్ జలసంధి మూసివేతతో పలు దేశాలు ఇంధన కొరత ఎదుర్కొంటుండగా.. పాకిస్తాన్‌లో ఆ పరిస్థితి తారాస్థాయికి చేరింది. ఇంధన కొరతతో రంజాన్ సెలవులు పొడగింపు సహా స్కూల్స్ మూసివేత, వర్క్ ఫ్రమ్ హోమ్ సదుపాయాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 26 నుంచి పిఎస్ఎల్ ఆరంభం కానుండగా.. తొలుత ఆరు వేదికల్లో షెడ్యూల్‌ను ప్రకటించారు. తాజాగా రెండు వేదికల్లోనే టోర్నమెంట్ నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కరాచీ, లాహోర్‌లోనే మ్యాచ్‌లన్నీ నిర్వహించేందుకు పిసిబి (పాకిస్తాన్ క్రికెట్ బోర్డు) రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు పీసీబీ చీఫ్ మోషిన్ నక్వీ ఆదివారం వెల్లడించారు.

**ఆరంభ వేడుకలు రద్దు**

ఈ నెల 26న లాహోర్‌లో పిఎస్ఎల్ ఆరంభ వేడుకలు నిర్వహించాల్సి ఉండగా.. వాటిని రద్దు చేసినట్టు నక్వీ తెలిపారు. 'ఇంధన కొరత ఎక్కువగా ఉంది. ప్రజలు అనవసరంగా ప్రయాణాలు చేయకుండా ప్రభుత్వం సూచనలు జారీ చేస్తోంది. ఈ సమయంలో పీఎస్ఎల్ మ్యాచ్‌లకు అభిమానులు రాకపోవటమే మంచిది. అభిమానులు లేకుండా జరుగుతున్న పీఎస్ఎల్‌ను ఆరు వేదికల్లో నిర్వహించటం అర్థ రహితం. అందుకే లాజిస్టికల్ ఇబ్బందులు లేకుండా రెండు స్టేడియాల్లోనే షెడ్యూల్ చేశాం. మరో 10-15 రోజుల్లో పరిస్థితుల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నాం. ఇంధన సరఫరా సాధారణ స్థాయికి చేరుకుంటే.. పిఎస్ఎల్ షెడ్యూల్ మార్పుపై ఆలోచన చేస్తామని' నక్వీ తెలిపారు. అభిమానులకు ప్రవేశం నిరాకరణతో ఫ్రాంచైజీలు టికెట్ల అమ్మకాల ఆదాయం కోల్పోతున్నాయి. టికెట్ల అమ్మకం ద్వారా లభించే ఆదాయాన్ని ఫ్రాంచైజీలకు పిసిబి పరిహారంగా చెల్లిస్తుందని నక్వీ తెలిపారు.

**ఆ క్రికెటర్లపై కఠిన చర్యలు!**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)లో ఆడేందుకు పాకిస్తాన్ సూపర్ లీగ్ (పిఎస్ఎల్) కాంట్రాక్టు రద్దు చేసుకున్న క్రికెటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ చీఫ్ నక్వీ అన్నారు. ఆటగాళ్ల కాంట్రాక్టు నిబంధనలు, న్యాయ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో కార్బిన్ బాష్‌పై పీసీబీ ఏడాది పాటు నిషేధం విధించిన సంగతి తెలిసిందే. జింబాబ్వే క్రికెటర్ బ్లెస్సింగ్ ముజరబాని కోల్‌కతా నైట్‌రైడర్స్, దసున్ శనక రాజస్తాన్ రాయల్స్ తరఫున ఆడేందుకు పిఎస్ఎల్ ఒప్పందం వదులుకున్న సంగతి తెలిసిందే. మోటీ, మెక్‌గుర్క్, బార్ట్‌మన్, స్పెన్సర్ జాన్సన్‌లు సైతం పీఎస్-ఎల్ నుంచి తప్పుకున్నా.. వ్యక్తిగత కారణాలను చూపించారు. పిఎస్ఎల్ ఈ నెల 26 నుంచి ఆరంభం కానుండ గా, 28 నుంచి ఐపిఎల్ షురూ కానుంది.

# అనాహత్, అభయ్‌లకు టైటిల్స్



ముంబై: ఇండియన్ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్లే టైటిల్స్ సాధించారు. టోర్నీ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అనాహత్ సింగ్ మహిళల టైటిల్ చేజిక్కించుకుంది. పురుషుల ఈవెంట్‌లో అభయ్ సింగ్ నిలకడైన ఆటతీరుతో విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన అమ్మాయిల ఫైనల్లో యువ సంచలనం అనాహత్ 3--1 (11--5, 11--6, 9--11, 11--6)తో ఈజిప్టు క్రీడాకారిణి హనా మొతాజ్‌ను ఓడించింది.

భారత ప్లేయర్ తొలి రెండు సెట్లను అలవోకగా గెలుచుకోగా... మూడో సెట్‌ను ఈజిప్టు అమ్మాయి దక్కించుకుంది. వెంటనే పుంజుకున్న అనాహత్ నాలుగో సెట్ నెగ్గి మ్యాచ్‌ను ముగించింది. గత నెలలో ఈ భారత ప్లేయర్ కెరీర్ బెస్ట్ ప్రపంచ 19వ ర్యాంకుకు ఎగబాకింది. ఇపుడు తాజా టైటిల్ విజయంతో టాప్--20 ర్యాంకింగ్స్‌లో నిలకడగా కొనసాగనుంది. 2022 ఆసియా క్రీడల్లో పతకం గెలిచిన అనాహత్... గతేడాది ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో కాంస్యంతో భారత్ 15 ఏళ్ల పతక నిరీక్షిణకు తెరదించింది. చెన్నైలో జరిగిన స్క్వాష్ ప్రపంచకప్‌లోనూ ఆమె బంగారు పతకంతో సత్తాచాటింది. భారత ఆటగాళ్ల మధ్యే జరిగిన పురుషుల ఫైనల్లో అభయ్ సింగ్ తన సహచరుడికి ఏమాత్రం అవకాశమివ్వకుండా వరుస సెట్లలో గెలుపొందాడు. అతను 11--9, 11--8, 11--4 వీర్ చౌత్రానిపై విజయం సాధించాడు.



## దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ గెలుపు

### సిరీస్ కైవసం

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్ మహిళల జట్టు టి-20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. వెల్లింగ్టన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో టి-20లో కివీస్ జట్టు 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఓ మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి159 పరుగులు చేసింది.సౌతాఫ్రికా ఆల్ రౌండర్ అనేరీ డెర్క్సెన్ మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 32 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 55 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెతోపాటు లాస్ 30 పరుగులతో ఆకట్టుకుంది. ఇక కివీస్ బౌలర్లలో జెస్ కెర్ 3 వికెట్లతో అదరగొట్టింది. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ మరోసారి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. కేవలం 34 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 పరుగులు చేసింది. డివైన్‌తో పాటు అమీలియా కేర్ 29 బంతుల్లో 31 పరుగులతో రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో క్లో ట్రయాన్ 2 వికెట్లు సాధించింది. అన్నేరీ డెర్క్సెన్, మ్లబా చెరో వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును జెస్ కెర్ అందుకుంది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు ఐదో టి-20 క్రైస్ట్‌చర్చ్ వేదికగా మార్చి 25న జరగనుంది.

## ఫిట్‌నెస్ నిరూపించుకోండి

కొలంబో (శ్రీలంక) : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడేందుకు సిద్ధమవుతున్న శ్రీలంక క్రికెటర్లకు ఆ దేశ క్రికెట్ బోర్డు ఓ నిబంధన విధించింది. నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) జారీ చేసేందుకు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావాలని మార్గదర్శకాలు జారీ చేసింది. దుష్మంత చమీర, పథుమ్ నిశాంక (ఢిల్లీ క్యాపిటల్స్), కామిందు మెండిస్ (సన్‌రైజర్స్) ఫిట్‌నెస్ పరీక్ష పాస్ అయ్యారు. దీంతో ఐపీఎల్‌లో ఆడేందుకు బోర్డు గ్రీన్ సిగల్ ఇచ్చింది. వానిందు హసరంగ (లక్నో సూపర్‌జెయింట్స్), నువాన్ కులశేఖర (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు), మతీశ పతిరణ (కోల్‌కతా నైట్‌రైడర్స్), ఈషన్ మలింగ (సన్‌రైజర్స్ హైదరాబాద్) ఫిట్‌నెస్ ఫరీక్షకు హాజరు కావాల్సి ఉంది. మే ఆఖరు వారం వరకు శ్రీలంక అంతర్జాతీయ షెడ్యూల్ ఖాళీగా ఉంది. దీంతో ఈ సమయంలో ఫిట్‌నెస్ ప్రమాణాలను మెరుగుపర్చు కోవాలని ఆటగాళ్లకు బోర్డు సూచనలు జారీ చేసింది.

# చెంచా కాదు.. చేతులతో తింటే శరీరానికి ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో తెలుసా..?



కాలంతోపాటు ఆహారపు అలవాట్లలో కూడా అనేక మార్పులు వచ్చాయి. నేటి బిజీ లైఫ్‌లో ప్రతి ఒక్కరూ యాంత్రిక జీవనానికి అలవాటు పడిపోయారు. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర కూడా కరువైంది. ఏది పడితే అది తినేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని దూరంపెట్టి, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌తో కడుపు నింపేసుకుంటున్నారు. అది కూడా నిలబడి, పరిగెడుతూ స్పూన్లు, ఫోక్‌స్పూన్‌ల మీద ఆధారపడుతున్నారు. చేతులు ఎంగిలి కాకుండా, పెదాలకు అంటకుండా స్పూన్‌తో తినడం చాలామందికి అలవాటుగా మారింది. ఇలా తినటం స్టేటస్ సింబల్‌గా భావించేవారు చాలా మంది ఉన్నారు. చేతులతో ఆహారం తినేవారిని చీప్‌గా చూస్తుంటారు. కానీ, ఆ పద్ధతిలో ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదేనా..? దీనిపై నిపుణులు ఏమంటున్నారు..? తదితర వివరాలు మీ కోసం.. స్పూన్లు, ఫోక్ స్పూన్లు కాకుండా.. ఆహారాన్ని చేతులతో తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో చాలా మంది తినడానికి చెంచా ఉపయోగిస్తున్నారు. దీని వల్ల తిన్న ఆహారం జీర్ణం కావడం కష్టమవుతుంది. అయితే చేతులతో తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం. 1. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: చేతులతో తినే సమయంలో ముందుగా ఆహారాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుంటాం. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. పోషకాలను బాగా గ్రహించడంలో సహాయపడుతుంది. 2. రుచిని పెంచుతుంది: చేతులతో ఆహారం తినేవారిలో ఆహారాన్ని చేయి తాకగాన్నే న నాడుల ద్వారా మెదడు, పొట్టకు సంకేతాలు చేరుతాయి. దీని వల్ల జీర్ణరసాలు, ఎంజైములు విడుదలై జీర్ణక్రియ సక్రమంగా సాగుతుంది. చేతులతో తినే సమయంలో ఆహారాన్ని నేరుగా చేతిలోకి తీసుకుని నోటిలో పెట్టుకుంటాం. అప్పుడు ముక్కుద్వారా ఆ వాసన ఆహారం రుచిని మరింత పెంచుతుంది. ఇది చెంచాతో తినేటప్పుడు అనుభవించదు. 3. నియంత్రణల పరిమాణం: మన చేతులతో తినేటప్పుడు మనం తినే ఆహారాన్ని సహజంగా కొలుస్తాము. చెంచాతో తింటే అతిగా తినే అవకాశం ఉంది. చెంచాతో అతిగా, వేగంగా తినడం వల్ల శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇది టైప్ -2 డయాబెటిస్‌కు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. 4. స్పర్శ ద్వారా అనుభూతి: మనం మన చేతులతో తినేటపుడు ఆహారం అకృతి, ఉష్ణోగ్రతను పసిగట్టవచ్చు. ఇది ఆహారంతో మరింత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరుస్తుంది. అంతేకాదు.. మన చేతులు, కడుపు, పేగులు కొన్ని మంచి బ్యాక్టీరియాలను కలిగి ఉంటాయి. ఇవి మనల్ని వ్యాధుల నుంచి కాపాడతాయి. 5. సాంస్కృతిక ప్రాముఖ్యత: చేతులతో భోజనం చేయడం చాలా మందికి ఆచారం. ఇది కుటుంబం కలిసి తినడం సామాజిక కోణాన్ని మెరుగుపరుస్తుంది. 6. మనసుకు మంచిది: చేతులతో భోజనం చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి ఒత్తిడి తగ్గుతుంది. దీంతో మనసుకు ఆనందం కలుగుతుంది. వీలైనంత వరకు చేతులతో తినండి. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చేతుల్లో హానిచేయని బ్యాక్టీరియా ఉండడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. పర్యావరణంలోని వివిధ హానికారక సూక్ష్మజీవుల నుంచి శరీరాన్ని కాపాడుతుందని కూడా నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఎప్పుడూ చెంచాతో కాకుండా చేతులతో తినండి.



# గుండెకు మేలు చేసే ఉల్లి కాడలు..

## రక్తప్రసరణ సజావుగా సాగాలంటే వీటిని తినాల్సిందే




ఉల్లిపాయలో అనేక సుగుగుణాలు ఉంటాయి. అందుకే ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే నానుడి ప్రజాజీవనంలో స్థిరపడి పోయింది. ఉల్లిపాయలే కాదు ఉల్లి కాడలు కూడా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతి మార్కెట్‌లో ఉల్లి కాడలు తక్కువ ధరకే లభ్యమవుతుంటాయి. ఉల్లి కాడలను ఇతర కూరగాయలతో కూడా జోడించి వంటలు చేయొచ్చు. ఆకర్షణీయంగా కనిపించడమేకాకుండా రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం..ఉల్లి కాడలు హృద్రోగులకు, వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఉల్లి కాడల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. దీన్ని కూరలో వేసుకుని తింటే గుండె జబ్బులు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే ఉల్లి కాడల్లో ఉండే క్వెర్సెటిన్ అనే పదార్థం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఈ యాంటీఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. అలాగే గుండె జబ్బుల వంటి తీవ్రమైన సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. ఇందులో విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, ఫైబర్ ధమనులను ఆరోగ్యంగా ఉంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఉల్లి కాడలను తినడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. అంటే, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే, దానిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో అధికంగా సల్ఫర్ ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీర నొప్పిని తగ్గిస్తాయి. నిత్యం ఉల్లి కాడలను ఆహారంలో భాగంగా తీసుకుంటే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

# అంత డేంజరా..? ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తింటే.. శరీరంలో ఏమవుతుందంటే..!



సమ్మర్ సీజన్ మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10దాటిందంటే.. సూర్యుడు ప్రతాపం మొదలవుతుంది. ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టామంటే.. చాలు ఉక్కపోత చెమట పట్టడం సహజం. బయటకు వెళ్లాక బట్టలన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. మన శరీరం నుండి పోషకాలు కోల్పోవడమే దీనికి కారణం. అయితే దీన్ని బ్యాలెన్స్ చేసేందుకు చాలామంది వేసవిలో పుచ్చకాయ ఎక్కువగా తింటుంటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కూడా ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి, ఈ పండును తీసుకోవడం వల్ల మన పొట్ట ఎక్కువ సమయం నిండుగా ఉంటుంది. ఈ పండు వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఇందులో 92శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది మన శరీరానికి ఎక్కువ వాటర్ కంటెంట్ అందిస్తుంది. తాజా పుచ్చకాయలో సిట్రులిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రులైన్ నైట్రిక్ ఆక్సైడ్ 6 ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులో ఉంటుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు పుచ్చకాయను రిఫ్రిజిరేటర్ లో ఉంచి తింటారు. కానీ ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయని మీకు తెలుసా..సాధారణంగా కొంతమంది మార్కెట్ నుండి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే పండ్లను కోసి ఫ్రిజ్‌లో ఉంచే అలవాటు ఉంటే మాత్రం వెంటనే దానిని వదిలేయండి. ముఖ్యంగా పుచ్చకాయను ఫ్రిజ్‌లో పొరపాటున కూడా పెట్టకూడదు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కంటే గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. ఎంత ఎండలోనైనా పుచ్చకాయ చాలా చల్లగా ఉంటుంది. తినడానికి రుచికరమైనది. కానీ కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్ లో ఉంచితే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా కోసిన పుచ్చకాయపై బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం.


# గసగసాలు గట్టిగా తినండి.. మధుమేహం నుండి గుండె జబ్బుల వరకు పరార్..!





గసగసాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో గసగసాలు తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే ఇవి చల్లటి గుణాన్ని కలిగి ఉంటాయి. అద్భుత ఔషధ గుణాలు కలిగి ఉన్న గసగసాలు తినటం ద్వారా పీచు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో గసగసాలు ఉపయోగపడతాయి. గసగసాలు తినడం వల్ల పొట్టకు చల్లదనం చేకూరుతుంది. ఇది ఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. గసగసాలు తినడం వల్ల శరీరంలో రక్తం కొరత తీరుతుంది. ఇవి ఎముకలను దృఢంగా చేస్తాయి. వేసవిలో తినడం వల్ల శరీరానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు కలుగుతాయి. గసగసాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. మెదడు సామర్థ్యం: మెదడుకు నరాల, రక్త కణాల ప్రవాహాన్ని నియంత్రించే సామర్థ్యం గసగసాలకు ఉంది. మెదడులోని నాడీ కణాలు ఉత్తేజితం కావడం వల్ల మెదడు సామర్థ్యం పెరుగుతుంది. కాబట్టి పాలలో ఉడకబెట్టిన గసగసాలు తింటే పిల్లల్లో జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. పెద్దలు గసగసాల పాలను తాగడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఎముకల ఆరోగ్యం: గసగసాలలో కాల్షియం, కాపర్ పుష్కలంగా ఉంటాయి. ఈ రెండు పోషకాలు ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. అలాగే ఎముకల మధ్య బంధన కణజాలాన్ని బలపరుస్తుంది. దీంతో కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. రక్త ప్రసరణ: గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది హానికరమైన చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. గసగసాలలో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిద్రలేమి: నిద్రలేమితో బాధపడేవారు రాత్రిపూట గసగసాలు ఎక్కువగా తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. ఒత్తిడిని తగ్గిస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. ఆందోళనను తగ్గిస్తుంది. ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. రోగనిరోధక శక్తి:మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి విటమిన్ సి ఎంత ముఖ్యమైనదో జింక్ కూడా అంతే ముఖ్యం. గసగసాలలో జింక్ పుష్కలంగా ఉంటుంది. దీనిని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య:థైరాయిడ్ గ్రంధికి జింక్ చాలా ముఖ్యమైన పోషకం. ఇది థైరాయిడ్ హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు జింక్ పుష్కలంగా ఉండే గసగసాలను తీసుకోవచ్చు. నోటి పుండు:తరచుగా నోటిపూత వచ్చినప్పుడు గసగసాలు తింటే ఉపశమనం లభిస్తుంది. యాంటీ బాక్టీరియల్ కాకుండా, గసగసాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. రాత్రి పూట గసగసాలు మెత్తగా చేసి పాలలో మరిగించి తాగాలి. ఇది ఆరోగ్యానికి అన్ని విధాలుగా మేలు చేస్తుంది.

# నేలపై పడుకుంటే ఇన్ని లాభాలా..? తెలిస్తే బెడ్‌కు గుడ్ బై చెప్పేస్తారు..!



కాలం మారింది.. దాంతో పాటుగానే ప్రజల జీవన విధానాలు మారిపోతున్నాయి. సౌకర్యాల విషయానికి వస్తే చాలా మంది ప్రజలు లగ్జరీ లైఫ్ కోసం పరుగులు పెడుతున్నారు.కానీ నేటికీ నేలపై పడుకునే పాత సంప్రదాయం ఇప్పటికీ సరైనదని మరోసారి నిరూపించబడింది ఈ ఆధునిక యుగంలో అందరూ మంచాలు, సుతిమెత్తటి బెడ్‌లను వాడుతున్నారు. కానీ, అలాంటి మంచాన్ని వదిలి నేలపై పడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసా..? ఆ లాభాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేలపై పడుకోవడం వల్ల కలిగే అసంఖ్యాక ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేల మీద పడుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం: మనస్తత్వవేత్తలు నేలపై పడుకోవడం వల్ల శరీరం రిలాక్సేషన్, నేలతో అనుబంధం ఏర్పడుతుందని అంటున్నారు. నేలపై పడుకోవడం వల్ల శరీర భంగిమ సరైన రీతిలో ఉంటుంది. అదే బెడ్‌పై పడుకున్నప్పుడు మనం నిద్రించే సమయంలో కుంగి ఉంటాయి. ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది. నేలపై పడుకోవడం వల్ల వెన్నెముక నిటారుగా ఉంటుంది. మనం నేలపై పడుకున్నప్పుడు మన శరీరం పూర్తిగా రిలాక్స్ అవుతుంది. మనం పూర్తి విశ్రాంతి తీసుకుంటాము. ఇది వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వెన్నెముకపై ఒత్తిడి తగ్గించుకునేందుకు పిల్లోను వాడుకోవచ్చు. నడుము భాగంలో పలుచని పిల్లోను పెట్టుకుని నిద్రించాలన్నది వైద్యుల సూచన. నేలపై పడుకోవడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు: నేలపై పడుకోవడం వల్ల మన శరీరానికి కావలసిన సహజమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది మన వీపును నిటారుగా ఉంచుతుంది. కండరాలను రిలాక్స్ చేస్తుంది. మీరు ఫ్లాట్ ఫ్లోర్‌లో పడుకున్నప్పుడు, మీ మనస్సులోని ఆందోళనలు కూడా తగ్గుతాయి. నేటి బీజీ లైఫ్ అత్యధిక ఒత్తిడితో కూడిన యుగంలో నేలపై నిద్రపోవడం మనల్ని ప్రకృతికి దగ్గర చేస్తుంది. భూమితో అనుసంధానం చేయడం ద్వారా మనం మరింత సమతుల్యత, ప్రశాంతతను పొందవచ్చు. నేలపై పడుకోవడం వల్ల మంచి నిద్రపడుతుంది. అదే విధంగా నిద్రలో సహజ శరీర కదలిక ఉంటుంది. పరుపులు, దిండ్ల ఒత్తిడి ఉండదు. మంచి రక్త ప్రసరణ ఉంటుంది. వేసవిలో నేలపై పడుకోవడం వల్ల శరీరానికి కాస్త చల్లగా అనిపిస్తుంది. నేల చల్లదనానికి, శరీర ఉష్ణోగ్రత నెమ్మదిగా తగ్గిపోతుంది. దీనివల్ల మరింత గాఢంగా నిద్ర పోవచ్చు. అంతేకాదు, చాలా మంది ఆఫీసు, ఇంటి పనితో అలసిపోతుంటారు. బాడీ పెయిన్స్ తో బాధ పడుతుంటారు. ఆ పెయిన్స్ ఉన్న వారు బెడ్ కి గుడ్ బై చెప్పి నేల మీద పడుకోవడం అలవాటు చేసుకోండి. ఆ హాయిని మీరు ఆస్వాదిస్తారు.

# బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే అద్భుత పండు ఇది.. మహిళలు తప్పక తినాల్సిందే



మహిళల్లో అధికంగా వచ్చే అనారోగ్య సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ముఖ్యమైనది. అయితే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు తీసుకునే అనేకానేక చర్యల్లో ఆహారం ఒకటి. సరైన ఆహారం తింటే శరీరంలో క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి కాకుండా నివారించవచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే ఆహారాల్లో పుచ్చకాయ ముఖ్యమైనది. ఇది రుచికి ఎంత కమ్మగా ఉంటుందో, దాని వల్ల చాలా ప్రయోజనాలు కూడా అంతే అధికంగా ఉన్నాయి. పుచ్చకాయలో 90 శాతం నీరు ఉంటుంది. కాబట్టి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో ఈ పండు ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వివిధ వ్యాధులను దూరం చేస్తాయి పుచ్చకాయ క్యాన్సర్‌ను నివారించడంలో కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ (కణాలను నాశనం చేసే క్రియాశీల అణువులు) తొలగించడంలో సహాయపడతాయి. అందుకే పుచ్చకాయ వివిధ క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని నిపుణులు అంటున్నారు. పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఇది ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడం ద్వారా క్యాన్సర్ నివారించడంలో సహాయపడుతుంది. ప్రత్యేకంగా ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పుచ్చకాయలో ఉండే లైసోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఫలితంగా పుచ్చకాయ సన్ టాన్ తొలగించడమే కాకుండా, చర్మ క్యాన్సర్‌ను కూడా నివారిస్తుంది. పుచ్చకాయలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ పుచ్చకాయ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. దృష్టి మెరుగుపడుతుంది. అంతేకాకుండా ఈ సీజనల్ వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కళ్లను రక్షిస్తుంది. నీటి కంటెంట్‌తో పాటు, పుచ్చకాయలో తగినంత మొత్తంలో విటమిన్-బి6 ఉంటుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. రోజూ పుచ్చకాయ తినడం వల్ల వేసవితాపం నుంచి కాపుడుకోవచ్చు. పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కేలరీల కంటెంట్ చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి శరీర బరువును తగ్గించుకోవాలనుకుంటే, ప్రతిరోజూ మీ ఆహారంలో ఈ పండును తీసుకోవచ్చు.

# ఆలివ్ ఆయిల్‌తో అద్భుతాలు..! ఇలా వాడితే మధుమేహం పరార్..




మధుమేహం అనేది ఒక దీర్ఘకాలిక అనారోగ్య సమస్య. ఈ వ్యాధి ఒకసారి వస్తే ఎప్పటికీ నయం కాదు. ఎందుకంటే దీనిని పూర్తిగా నయం చేసే చికిత్స ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. చాపకింద నీరులా సోకే మధుమేహం రాకుండా ఉండాలంటే ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండటం అవసరం. రక్తంలో గ్లూకోజ్ పెరిగినప్పుడు మనిషికి మధుమేహం వస్తుంది. గ్లూకోజ్ మన శరీరానికి శక్తి ప్రధాన వనరుగా పరిగణించబడుతుంది. శరీరం గ్లూకోజ్‌ని తయారు చేయగలదు. ఇన్సులిన్ అనేది ప్యాంక్రియాస్ ఉత్పత్తి చేసే హార్మోన్. ఇది గ్లూకోజ్ కణాలలోకి ప్రవేశించడానికి సహాయపడుతుంది. మధుమేహం బాధితుల్లో శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయదు..లేదంటే ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించదు. అటువంటి పరిస్థితిలో గ్లూకోజ్ రక్తంలో పేరుకుపోతుంది. కణాలకు చేరుకోలేకపోతుంది. మధుమేహం మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మధుమేహాన్ని నియంత్రించడానికి, నిపుణులు ఆరోగ్యకరమైన జీవనశైలిని, మంచి ఆహారాన్ని సిఫార్సు చేస్తారు. మధుమేహాన్ని నియంత్రించడంలో ఆలివ్ ఆయిల్ ఎంత ప్రభావవంతంగా ఉంటుందో తెలుసుకుందాం మధుమేహాన్ని నియంత్రించడానికి ఆలివ్ ఆయిల్ ప్రయోజనాలు: ఆలివ్ ఆయిల్ రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ముఖ్యంగా టైప్ 2డయాబెటిస్ రోగులకు ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఆలివ్ నూనెలో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ఆలివ్ ఆయిల్ యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. అధిక చక్కెర కారణంగా ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో, యాంటీఆక్సిడెంట్లు దాని స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి.ఇదిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు మధుమేహం వల్ల శరీరంలో చాలా సార్లు వాపు వస్తుంది. ఆలివ్ ఆయిల్ గుణాలు శరీరంలో మంటను తగ్గించి, సెల్ డ్యామేజ్‌ను నివారిస్తాయి. 1టేబుల్ స్పూన్ ఆలివ్ నూనెలో 14 గ్రాముల మొత్తం కొవ్వు ఉంటుంది. కానీ ఫైబర్, చక్కెర ఉండదు. ఇది విటమిన్లు మంచి మూలం. ఆలివ్ నూనెలో ఫైటోస్టెరాల్స్ ఉంటాయి.ఇదిగుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. ఇదిమన ఆహారం నుండి కొలెస్ట్రాల్ శోషణను నిరోధిస్తుంది. గుండె జబ్బులతో సంబంధం ఉన్న చెడు కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. మీరు ఒక రోజులో ఎంత తింటారు అనేది ముఖ్యం. మీరు రోజుకు 3 నుండి 4 టీస్పూన్ల ఆలివ్ నూనెను మాత్రమే తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్ ఇతర ప్రయోజనాలు..ఆలివ్ ఆయిల్ మంటను తగ్గిస్తుంది. ఆలివ్ నూనె ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఆలివ్ ఆయిల్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆలివ్ నూనె రక్తపోటును తగ్గిస్తుంది.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# ఇప్పటికీ నా మాటలకు కట్టుబడి ఉన్నా

## గావస్కర్



ఢిల్లీ : ది హండ్రెడ్ లీగ్‌లో పాకిస్థాన్ క్రికెటర్‌ను కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ లీడ్స్ యాజమాన్యం సన్ గ్రూప్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే, గత ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో పాక్ కామెంటేటర్లతో కలిసి గావస్కర్ ఓ షోలో పాల్గొన్నాడు. ఇక భారత్ - పాక్ మ్యాచ్‌లకూ కామెంటేటర్‌గా వ్యవహరిస్తుంటారు. అప్పుడు మీరు ఎందుకు హాజరయ్యారంటూ తాజాగా ఆయనపై విమర్శల వర్షం కురుస్తోంది. దానికి సన్నీ సమాధానం ఇస్తూనే.. గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.

"నేను ఐసీసీ, ఏసీసీ కామెంట్రీ ప్యానెల్స్‌లో సభ్యుడిని. ఆ రెండింటి నుంచి వచ్చే రెవెన్యూ అన్ని దేశాలకూ వెళ్తుంది. అలాంటప్పుడు నన్ను మీరు ఎలా ప్రశ్నించగలరు? ఇక ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో పాక్ క్రికెట్ షో 'ది డ్రెస్సింగ్ రూమ్'లో వసీమ్ అక్రమ్, వకార్ యూనిస్‌తో కనిపించడంపైనా వ్యాఖ్యలు చేస్తున్నారు. నేనేమీ ఒక్క రూపాయి తీసుకోలేదు. వారికి చెల్లించలేదు. ఇలాంటప్పుడు పాక్‌కు నేను ప్రత్యక్షంగా ఏమీ ఇవ్వడం లేదు కదా. ఇకపోతే నేను సీపీఎల్, ఐఎల్‌టీ20, ఎస్ఏ20 లీగ్‌లను ఫాలో కావడం లేదు. ఎవరు ఆడుతున్నారో కూడా తెలియదు. ఒకవేళ అందులోనూ భారతీయ సంస్థకు చెందిన ఫ్రాంచైజీలో పాక్ క్రికెటర్లు ఆడుతుంటే.. ఇప్పటికైనా నిలిపేయాలి. పాకిస్థాన్ ఆటగాళ్లకు భారత ఫ్రాంచైజీలు డబ్బులు చెల్లించడం ఆపాలని కోరుతున్నాను" అని సునీల్ గావస్కర్ తెలిపాడు.

### అతడికేం సంబంధం..

"జైషా ఇప్పుడు ఐసీసీ అధ్యక్షుడు. అతడు రాకముందు నుంచే దశాబ్దాలుగా భారత్ - పాక్ మ్యాచులు జరుగుతున్నాయి. ఇప్పుడు ఒకే గ్రూప్‌లో ఇరు జట్లు ఉండటంతో ఇదంతా ఆయన వల్లేనన్న వ్యాఖ్యలు అర్థరహితం. కేవలం జై షా మాత్రమే కాదు.. ఐసీసీలోని సభ్యులంతా కలిసి షెడ్యూల్‌ను రూపొందిస్తారు. పీసీబీకి రెవెన్యూను ఐసీసీ, ఏసీసీ ఇస్తుంది" అని గావస్కర్ వెల్లడించారు.

## ఐపీఎల్ ఫాస్టెస్ట్ బౌలర్..

# ఘనమైన కమ్‌బ్యాక్‌పై గురి!



ఢిల్లీ : ఐపీఎల్ చరిత్రలో 156.7 కి.మీల స్పీడ్‌తో అత్యంత వేగంగా బంతిని విసిరిన బౌలర్ మయాంక్ యాదవ్. ఇప్పటి వరకూ అతడిదే రికార్డు. ఇలాంటి పేసర్ గుర్తున్నాడా..? గాయం కారణంగా గత సీజన్ మొత్తానికి దూరమైన ఈ పేస్ సెన్సేషన్ మళ్లీ ఐపీఎల్‌లో అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న 19వ సీజన్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. ఇప్పటికే లఖ్‌నవూ మైదానంలో ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు.

బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీలో ఉంటూ గాయం నుంచి కోలుకున్న 23 ఏళ్ల మయాంక్ తన బౌలింగ్‌కు మరింత పదునుపెట్టాడు. తరచూ గాయాలతో సావాసం చేసే అతడు.. ఇప్పుడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించడంతో లఖ్‌నవూ జట్టులో జోష్ తెప్పించినట్లైంది. మానసికంగా సిద్ధంగా ఉన్నానని మయాంక్ స్పష్టం చేశాడు. గత పది నెలల కాలంలో కేవలం రెండే మ్యాచులను మాత్రమే ఆడాడు. అదీనూ భారత్‌-ఎ తరఫున కావడం గమనార్హం. అయినా, బౌలింగ్‌లో లయను అందుకొనేందుకు కష్టపడినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి.

"ఇప్పుడు చాలా బాగున్నా. పూర్తిస్థాయిలో రెడీ. ఎలాంటి ఇబ్బందులు లేవు. వేగంగా వేయడంపై బయట నుంచి వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోను. ఎంత ఫాస్ట్‌గా బంతిని విసురుతానో మీరూ చూద్దురు. ఆట నుంచి సుదీర్ఘమైన లేఆఫ్ తీసుకున్నా. గత పది నెలల్లో కనీసం ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయా. అయితే, అప్పుడు ఎలాంటి ఉద్దేశంతో ఉన్నానో.. నా కమ్‌బ్యాక్‌లోనూ అదే దూకుడుతో బౌలింగ్ చేస్తా. గాయాలను మేనేజ్ చేయడం మన చేతుల్లో లేదు.. కానీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే చేయగలను" అని మయాంక్ యాదవ్ నమ్మకంగా చెబుతున్నాడు.

ఐపీఎల్ 2024 సీజన్‌లో నాలుగు మ్యాచుల తర్వాత గాయంతో ఇబ్బంది పడ్డాడు. అతడిపై నమ్మకం ఉంచిన లఖ్‌నవూ మేనేజ్‌మెంట్ రూ. 11 కోట్లకు రిటైన్ చేసుకుంది. కానీ, గత సీజన్‌లోనూ కేవలం రెండు మ్యాచులకే పరిమితం కావాల్సి వచ్చింది. వెన్నునొప్పి తీవ్రత కారణంగా జాతీయ జట్టులోనూ ఆడలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్‌లో శస్త్రచికిత్స చేయించుకుని మరీ వచ్చాడు.

# ఇప్పుడుంది అసలు సవాల్!

**హైదరాబాద్ : మెరుపు ఆటతో పాకెట్ డైనమోగా పేరు తెచ్చుకుని కెరీర్ ఆరంభంలోనే వన్డేల్లో డబుల్ సెంచరీతో మెరిశాడు ఇషాన్ కిషన్. ఆ తర్వాత క్రమశిక్షణ తప్పి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయి టీమ్‌ఇండియాకు దూరమయ్యాడు. కానీ అతడికి త్వరగానే రెండో అవకాశం దక్కింది. తప్పులు దిద్దుకుని మళ్లీ జట్టులోకి రావడమే కాదు.. తాజా టీ20 ప్రపంచకప్‌లో మెరుపులతో జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. 2026 ఐపీఎల్‌లో ప్యాట్ కమిన్స్ గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరం కావడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును నడిపించే అవకాశాన్ని అందుకున్నాడు ఇషాన్. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఝార్ఖండ్‌ను విజేతగా నిలబెట్టిన ఇషాన్.. ఐపీఎల్ సవాలును ఎలా ఎదుర్కొంటాడన్నది ఆసక్తికరం.**




### అంత తేలిక కాదు

2024 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రదర్శన ఒక చరిత్ర. విధ్వంసక బ్యాటింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తూ.. ప్రత్యర్థి జట్లను బెంబేలెత్తించేసింది ఆ జట్టు. ఎస్‌ఆర్‌హెచ్ ధాటికి ఐపీఎల్ అత్యధిక స్కోరు రికార్డు నాలుగుసార్లు బద్దలైంది. ఆ సీజన్లో ఫైనల్‌కు దూసుకెళ్లిన సన్‌రైజర్స్ త్రుటిలో టైటిల్ కోల్పోయింది. కానీ గత ఏడాది భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన ఆ జట్టు.. తీవ్రంగా నిరాశపరిచింది. కానీ ఈసారి మళ్లీ ఆ జట్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, క్లాసెన్, ఇషాన్ కిషన్ లాంటి విధ్వంసకారులతో నిండిన టీమ్ బ్యాటింగే బలంగా బరిలోకి దిగుతోంది. మరి ఈ జట్టును ఇషాన్ ఎలా ముందుకు తీసుకెళ్తాడో చూడాలి. గతేడాది రూ.11.25 కోట్లతో ఇషాన్‌ను దక్కించుకుంది సన్‌రైజర్స్. అందుకు తగ్గట్టే ఆడిన తొలి మ్యాచ్‌లోనే మెరుపు సెంచరీ (47 బంతుల్లోనే 106 నాటౌట్)తో అదరగొట్టాడు. ఆ తర్వాత ఆ స్థాయిలో రాణించకపోయినా.. కీలక పరుగులు చేశాడు. అదే ఏడాది ఝార్ఖండ్ కెప్టెన్‌గానూ సత్తా చాటాడు ఇషాన్. ఏమాత్రం అంచనాలు లేకుండా ముస్తాక్ అలీ టోర్నీలో జట్టును సమర్థంగా నడిపించాడు. ఝార్ఖండ్‌కు తొలిసారి టైటిల్ అందించాడు. ఈ టోర్నీలో అటు బ్యాటర్‌గా ఇటు సారథిగా ఈ వికెట్‌కీపర్ బ్యాటర్ అదరగొట్టాడు. హరియాణాతో ఫైనల్లో 49 బంతుల్లోనే 101 పరుగులు చేశాడు. మొత్తం 11 మ్యాచ్‌ల్లో 517 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అదే ఫామ్‌ను దక్షిణాఫ్రికాతో సిరీస్‌లోనూ, ఆపై టీ20 ప్రపంచకప్‌లోనూ ప్రదర్శించాడు ఈ డాషింగ్ బ్యాటర్. టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆడిన ఇన్నింగ్స్ (40 బంతుల్లో 77) అద్భుతం. అయితే ఎంతో ఒత్తిడి ఉండే ఐపీఎల్‌లో ఇషాన్ తొలిసారి కెప్టెన్సీ చేయబోతున్నాడు. టోర్నీ రెండో అర్ధంలో అయినా కమిన్స్ వస్తాడని ఎస్‌ఆర్‌హెచ్ భావిస్తోంది. ఒకవేళ రాకపోతే ఇషాన్‌పై పూర్తి స్థాయి కెప్టెన్‌గా మరింత బాధ్యత పెరుగుతుంది. మరి ఎప్పట్లాగే ఇషాన్ తనదైన శైలిలో దూకుడుగా ఆడతాడా.. లేదా కెప్టెన్ కాబట్టి శైలి మారుస్తాడా అన్నది ఆసక్తికరం. నిరుడు సన్‌రైజర్స్ దూకుడు మిశ్రమ ఫలితాలను ఇచ్చింది.

# 120 శాతం ప్రదర్శన ఇద్దాం




బెంగళూరు: ఐపీఎల్ కొద్ది రోజుల్లో ఆరంభం కాబోతోంది. అన్ని జట్లూ ప్రాక్టీస్‌ను వేగవంతం చేశాయి. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా నెట్స్‌లో కష్టపడుతోంది. ఆ జట్టు స్టార్ విరాట్ కోహ్లి కఠోర సాధన చేస్తున్నాడు. శనివారం నెట్స్‌లో అతడు తన శైలి స్ట్రోక్స్‌ను సాధన చేశాడు. విరాట్ ప్రాక్టీస్, అతడు సహచరులతో మాట్లాడుతున్న వీడియోలను బెంగళూరు ఫ్రాంఛైజీ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది.

"ఈ రోజులను మనం వృథా చేయకూడదు. మనం ఎప్పుడూ ముందంజలో ఉండాలి. సీజన్ మొత్తంలో ఒక్క నిమిషం కూడా వృథా కాకూడదు. మనం ఈ రెండున్నర నెలలు 120 శాతం ప్రదర్శనను ఇవ్వాలి. ఛాలెంజర్స్ కావడానికి అందరిలోనూ ఉత్సాహం ఉందని మీ ముఖాలు చూస్తే అర్థమవుతోంది" అని సహచరులతో కోహ్లి పేర్కొన్నాడు. గత మూడేళ్లు ప్రతి సీజన్‌లోనూ 600 పైగా పరుగులు సాధించిన విరాట్.. ఈసారి కూడా అదే స్థాయిలో రాణించి టైటిల్ నిలబెట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. 18 ఏళ్ల ఎదురుచూపుల అనంతరం గతేడాది బెంగళూరు తొలిసారి ఐపీఎల్ ఛాంపియన్ అయింది. ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఆర్సీబీ ఓడించింది.

# ఢిల్లీ క్యాపిటల్స్ కల తీరేనా..?

## ఐపీఎల్ మరో 6 రోజుల్లో



**ఢిల్లీ : ఇప్పటిదాకా ఐపీఎల్‌లో 18 సీజన్లు జరిగితే... ఢిల్లీ ఒకే ఒక్కసారి (2020) ఫైనల్ చేరగలిగింది. ప్రదర్శన ఎప్పుడూ అస్థిరమే. 18 సీజన్లలో ఆరుసార్లు మాత్రమే లీగ్ దశను దాటగలిగింది. 2019 నుంచి 2021 వరకు మూడేళ్లు ప్లేఆఫ్స్‌కు చేరి బలమైన జట్టుగా ఎదిగినా.. ఆ తర్వాత మళ్లీ గాడితప్పింది.**

గత నాలుగేళ్లూ ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టలేకపోయింది. అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ, ఈసారి కూడా గట్టి పోటీదారుల జాబితాలో లేదు. 2025 ఐపీఎల్‌లో ఆరంభంలో వరుస విజయాలు సాధించి, ఫేవరెట్లలో ఒకటిగా మారింది. కానీ గ్రూప్ దశ ఆఖర్లో ఫామ్‌ను కోల్పోయింది. తొలి ఆరు మ్యాచ్‌ల్లో అయిదు నెగ్గిన ఢిల్లీ.. ఆ తర్వాత ఎనిమిది మ్యాచ్‌ల్లో రెండే గెలిచింది. పాయింట్ల పట్టికలో అయిదో స్థానంతో సరిపెట్టుకున్న ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. అయితే నిరుడు లయను కొనసాగించలేకపోయిన ఆ జట్టు ఈసారి మెరుగ్గా కనిపిస్తోంది. అనేకమంది అనుభవజ్ఞులు విఫలమైన నేపథ్యంలో జట్టులో కొన్ని మార్పులు చేసుకుంది. డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్ లాంటి బ్యాటర్లను వదిలేసి.. వేలంలో మిల్లర్, బెన్ డకెట్, నిశాంక, ఎంగిడిలను సొంతం చేసుకుంది. రాజస్థాన్ రాయల్స్ నుంచి నితీశ్ రాణాను తీసుకుంది. అయితే ఈసారి కూడా ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన జట్టు రాహుల్, అక్షర్ పటేల్, స్టబ్స్, కుల్‌దీప్ యాదవ్, స్టార్క్‌లతో నిర్మితమై ఉంది. మరి బలమైన దేశీ, విదేశీ లైనప్‌లు కలిగి ఉన్న ఢిల్లీ ఈసారైనా కప్పు కల నెరవేర్చుకుంటుందా అన్నది చూడాలి. ఏప్రిల్ 1న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌తో ఢిల్లీ టైటిల్ వేట ఆరంభమవుతుంది. హేమంగ్ బదాని ఆ జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

బలాలు: టాప్ ఆర్డర్‌లో పదే పదే మార్పులు చేయడంతో నిరుడు ఢిల్లీ క్యాపిటల్స్ దెబ్బతింది. ఎనిమిది భిన్న ఓపెనింగ్ కాంబినేషన్లను ప్రయత్నించడం ఆ ఫ్రాంఛైజీ ప్రణాళిక లోపాన్ని సూచిస్తుంది. డకెట్, నిశాంకల రూపంలో ఈసారి మంచి ఓపెనింగ్ జోడీ ఢిల్లీకి ఉంది. పృథ్వీ షా కూడా అందుబాటులో ఉన్నాడు. పరిస్థితులను, ప్రత్యర్థిని బట్టి ఓపెనింగ్ జోడీని బరిలోకి దించవచ్చు. మూడో స్థానంలో కేఎల్ రాహుల్ రూపంలో మేటి బ్యాటర్ ఉన్నాడు. నిరుడు ఢిల్లీకి వచ్చిన అతను నిలకడగా రాణించాడు. మిల్లర్, స్టబ్స్, అశుతోష్ శర్మలతో ఢిల్లీ మిడిల్ ఆర్డర్ కూడా బలంగా ఉంది. వీళ్లు బంతిని బాగా బాదగలరు. కానీ ఢిల్లీ ప్రధాన బలం మాత్రం బౌలింగే. స్టార్క్, కుల్‌దీప్, ఎంగిడి, నటరాజన్‌ల రూపంలో వికెట్లు తీయగల బౌలర్లు ఢిల్లీకి ఉన్నారు. వాళ్లకు తోడు కశ్మీర్ స్టార్ ఆకిబ్ నబి కూడా సత్తా చాటడానికి సిద్ధమవుతున్నాడు. అతణ్ని వేలంలో రూ.8.4 కోట్లకు ఢిల్లీ సొంతం చేసుకుందంటే తన సామర్థ్యంపై గట్టి నమ్మకమున్నట్లే. బంతితో, బ్యాటుతో సత్తా చాటగల అక్షర్ పటేల్ జట్టుకు పెద్ద బలం.

VIVID PROMOTIONS Pvt. Limited. # 9-18-1, Vinayagar Enclave, C.B.M.Compound, Visakhapatnam - 530 003. Ph : 0891-2734422. E-mail : vizagpublic@gmail.com Editor : YADAVALLI VENKATA HARI KRISHNA SAI

# విశ్వజి



## జుట్టు రాలడం తగ్గాలంటే ఈ పోషకాలు అవసరం.. వీటిని రోజూ తీసుకోవాలి..

అందమైన, ఆరోగ్యవంతమైన జుట్టు కావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అందుకోసం ఎంతో ఖర్చు చేస్తూ ఉంటారు. అనేక రకాల హెయిర్ ప్రొడక్ట్స్ ను వాడుతూ ఉంటారు. అయినప్పటికీ చాలా మందికి అందమైన జుట్టును సొంతం చేసుకోవడం ఒక కల లాగానే ఉంటుందని చెప్పవచ్చు. ఒత్తైన, ఆరోగ్యవంతమైన జుట్టు కావాలనుకునే వారు హెయిర్ ప్రొడక్ట్స్ ను వాడడంతో పాటు జుట్టు పెరుగుదలకు అవసరమయ్యే సప్లిమెంట్స్ ను కూడా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఈ సప్లిమెంట్స్ జుట్టు పెరుగుదలలో గణణీయమైన మార్పును తీసుకు వస్తాయని వారు సూచిస్తున్నారు. జుట్టు కుదుళ్లను బలోపేతం చేయడం, జుట్టును మందంగా, ఒత్తుగా చేయడం, జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడం వంటి పనులను సప్లిమెంట్స్ నిర్వహిస్తాయని చెప్పవచ్చు. కనుక జుట్టు పెరుగుదలకు అవసరమైన వివిధ రకాల సహజ సప్లిమెంట్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. బయోటిన్..జుట్టు పెరుగుదలకు మద్దతు ఇచ్చే వాటిల్లో బయోటిన్ ఒకటి. జుట్టు నిర్మాణానికి అవసరమయ్యే కెరాటిన్ అనే ప్రోటీన్ ను సంశ్లేషణ చేయడంలో ఈ బి విటమిన్ సహాయపడుతుంది. చాలా మంది బయోటిన్ లోపంతో బాధపడుతూ ఉంటారు. దీంతో జుట్టు రాలడం, పలుచగా తయారవ్వడం, జుట్టు విరిగిపోవడం వంటివి జరుగుతాయి. జుట్టు సంబంధిత సమస్యలతో బాధపడే వారు ఆహారంలో గుడ్లు, గింజలు, తృణ ధాన్యాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఈ విటమిన్ లోపంతో మరింత ఎక్కువగా బాధపడే వారు బయోటిన్ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల జుట్టు సమస్యల నుండి సులభంగా బయటపడవచ్చు. సా పాల్మెట్టో అనే సప్లిమెంట్ ను తీసుకోవడం ద్వారా జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా బట్టతలతో బాధపడే వారు ఈ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ సప్లిమెంట్ జుట్టు రాలడాన్ని తగ్గించడంతో పాటు జుట్టు తిరిగి పెరిగేలా ప్రోత్సహిస్తుంది. బట్టతలతో బాధపడే వారు ఎక్కువగా సింథటిక్ చికిత్సలను తీసుకుంటూ ఉంటారు. అలాంటి వారు సా పాల్మెట్టో సప్లిమెంట్ ను తీసుకోవడం ద్వారా చికిత్స అవసరం లేకుండా సహజంగా తిరిగి జుట్టును పొందవచ్చు. అశ్వగంధ..

జిన్సెంగ్ ( అశ్వగంధ) ను సాంప్రదాయ వైద్యంలో చాలా కాలంగా వాడుతున్నారు. ఈ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల తలకు రక్తప్రసరణ పెరుగుతుంది. జుట్టు కుదుళ్లు బలంగా తయారవుతాయి. జుట్టు తెల్లగా మారడాన్ని అకాల బూడిద రంగును నివారించడంలో జిన్సెంగ్ ఎంతో సహాయపడుతుంది. ఈ సప్లిమెంట్స్ ను తీసుకోవడం ద్వారా లేదా జుట్టుకు అప్లై చేయడం ద్వారా ఒత్తుగా, ఆరోగ్యవంతమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు. సాధారణంగా వయసు పెరిగే కొద్ది కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీని వల్ల జుట్టు కుదుళ్లు బలహీనపడతాయి. జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుంది.

# ఈ పండ్లను రోజూ తింటే మీ గుండె సేఫ్..



### హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు..

శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో గుండె ఒకటి. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా అవసరం. కానీ ప్రస్తుత కాలంలో చాలా మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. గుండెపోటు, స్ట్రోక్ ల కారణంగా ప్రాణాలను కోల్పోతున్నారు. కనుక గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యంగా ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లతో నిండిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి పోషకాలన్ని కలిగి ఉన్న ఆహారాల్లో పండ్లు కూడా ఒకటి. పండ్లను తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. గుండె ఆరోగ్యాన్ని సంరక్షించడంలో సహాయపడే పండ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### బెర్రీలు, యాపిల్ పండ్లు..

గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో బెర్రీ జాతికి చెందిన పండ్లు ఎంతో సహాయపడతాయి. బ్లూబెర్రీ, స్ట్రాబెర్రీ, రాస్ప్బెర్రీ వంటి పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఆంథోసైనిన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి గుండె ప్రమాదాలను తగ్గించడంలో దోహదపడతాయి. ఈ పండ్లను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. స్మూతీ, పెరుగు, ఓట్ మీల్ వంటి వాటితో ఈ పండ్లను కలిపి తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆపిల్ పండ్లు కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఈ ఫైబర్ సహాయపడుతుంది. ఆపిల్స్ పాలీఫినాల్స్ ను కూడా కలిగి ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించే ప్రభావాలను కలిగి ఉంటాయి. ఆపిల్ ను తొక్కతో సహా కలిపి తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు.

### అవకాడో, నారింజ పండ్లు..

అవకాడోలు మోనోశాచురేటెడ్ కొవ్వులను కలిగి ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో అవసరం. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుంది. అవకాడోలను తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. హోల్ గ్రెయిన్ టోస్ట్ లతో, సలాడ్స్, స్మూతీ వంటి వాటితో అవకాడోలను కలిపి తీసుకోవచ్చు. నారింజ పండ్లు గుండె ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయి. వీటిలో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని, రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ధమనుల ధృడత్వాన్ని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. తాజా నారింజ పండ్ల రసాన్ని తీసుకోవడం లేదా నారింజ పండ్లను నేరుగా నమిలి తినడం వంటివి చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

### దానిమ్మ పండ్లు..

ఇక దానిమ్మ పండ్లు కూడా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో దోహదపడతాయి. దానిమ్మ పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ప్యూనికాలాజిన్లు ఉంటాయి. ఇవి ధమనుల్లో అడ్డంకులు ఏర్పడకుండా కాపాడడంలో, రక్తప్రవాహాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. సలాడ్లు లేదా పెరుగు మీద దానిమ్మ గింజలను చల్లి తీసుకోవడం ద్వారా, స్వచ్ఛమైన దానిమ్మ పండ్ల రసాన్ని తీసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ఈ విధమైన పండ్లను రోజూ ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. తద్వారా గుండె ఆరోగ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## బీట్ రూట్‌ను ఇన్ని రకాలుగా ఉపయోగించవచ్చు..

### మీ ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది.

మచ్చలేని, మెరిసే, అందమైన చర్మం కావాలని అందరూ కోరుకుంటారు. దాని కోసం ఎంతో ఖర్చు చేస్తూ ఉంటారు. సీరమ్, క్రీమ్ అని రకరకాల రసాయనాలను చర్మానికి రాస్తూ ఉంటారు. సంక్లిష్టమైన చర్మ సంరక్షణ దినచర్యలో ఒక భాగమైపోయిందని చెప్పవచ్చు. అయితే కొన్నిసార్లు అత్యంత ప్రభావవంతంగా పని చేసే నివారణలు ప్రకృతి నుండి వస్తాయని మీకు తెలుసా. ముఖ సౌందర్యాన్ని పెంచడంలో బీట్‌రూట్ ఎంతో సహాయపడుతుంది. ప్రకృతి నుండి సహజంగా లభించే ఈ బీట్‌రూట్ గొప్ప పోషకాలను కలిగి ఉంటుంది. దీనిని ఉపయోగించడం వల్ల సహజంగానే ఆరోగ్యకరమైన మెరుపును సొంతం చేసుకోవచ్చు. బీట్‌రూట్ ను వాడడం వల్ల తక్షణ గులాబీ రంగును మనం పొందవచ్చు. ముఖంపై పింక్ గ్లో కోసం బీట్‌రూట్ ను ఉపయోగించే మార్గాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### బీట్ రూట్ ఫేస్ మాస్క్..

బీట్‌రూట్ ను ఉపయోగించే సులభమైన మార్గాల్లో ఫేస్ మాస్క్ ఒకటి. దీనిని తయారు చేసుకోవడానికి గాను ఒక టీ స్పూన్ బీట్‌రూట్ రసంలో ఒక టీ స్పూన్ తేనె లేదా పెరుగు వేసి బాగా కలపాలి. తరువాత దీనిని ముఖానికి రాసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ముఖం తాజాగా పింక్ గ్లోతో కనిపిస్తుంది. బీట్‌రూట్ ను స్క్రబ్ లాగా కూడా ఉపయోగించుకోవచ్చు. బీట్‌రూట్ రసంలో కాఫీ లేదా చక్కెర వేసుకోవాలి. తరువాత కొద్దిగా తేనె వేసి కలపాలి. దీనిని చర్మంపై వృత్తాకార దిశలో రాస్తూ మర్దనా చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉండే మురికి, మృతకణాలు తొలగిపోయి ముఖం తాజాగా, అందంగా కనిపిస్తుంది. ఉదయం నిద్ర లేచిన తరువాత కళ్లు, ముఖం కొద్దిగా ఉబ్బినట్టు కనిపిస్తాయి. ఈ వాపును తగ్గించడంలో బీట్‌రూట్ ఐస్ క్యూబ్స్ ఎంతగానో సహాయపడతాయి.

### బీట్ రూట్ ఐస్ క్యూబ్స్..

ఈ ఐస్ క్యూబ్స్ ను తయారు చేసుకోవడానికి నీటిలో బీట్‌రూట్ రసం వేసి కలిపి ఐస్ ట్రేలో పోయాలి. ఈ నీటిని రాత్రంతా ఫ్రిజ్ లో ఉంచి ఐస్ గా మారిన తరువాత ముఖంపై అప్లై చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల వాపు తగ్గడంతో పాటు చర్మం ప్రకాశవంతంగా, బిగుతుగా తయారవుతుంది. ఇక బీట్‌రూట్ ను టోనర్ గా ఉపయోగించుకోవచ్చు. బీట్‌రూట్ రసాన్ని రోజ్ వాటర్ తో కలిపి స్ప్రే బాటిల్ లోకి బదిలీ చేసుకోవాలి. రాత్రి నిద్రించే ముందు ముఖంపై స్ప్రే చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మ రంధ్రాలు బిగుతుగా మారడంతో పాటు చర్మం కూడా సహజంగా గులాబీ రంగును సంతరించుకుంటుంది. బీట్‌రూట్ శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించడంతో పాటు చర్మ సౌందర్యాన్ని మెరుగుపరచడంలో కూడా అనేక రకాలుగా మనకు సహాయపడుతుంది. దీనిని ఉపయోగించడం వల్ల సహజంగా, ఎటువంటి ఖర్చు లేకుండా చర్మ ఆరోగ్యాన్ని, సౌందర్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు.





## పరీక్ష.. ఓ బెస్ట్ ఫ్రెండ్

నీకో ఫ్రెండ్ ఉన్నాడు. తను కలిసిన ప్రతిసారీ జీవితంలో ఓ మెట్టు పైకి ఎక్కుతున్నావ్. ఈ క్రమంలో నువ్వు అలసిపోయి ఆగిపోతే ఆ ఫ్రెండ్ నీ ప్రయాణం ఆగకుండా మరో చాన్స్ తీసుకువస్తున్నాడు. అలాంటి ఫ్రెండ్‌ని నువ్వు ఇష్టపడతావా? అతనికి భయపడతావా? అంటే, ఊరుకో బాస్ అలాంటి దోస్తుకి ఎవరైనా భయపడతారా? ఇష్టపడతారు గానీ అంటారు కదా! మరి పరీక్ష అంటే భయమెందుకు బ్రో.. మనం చెప్పుకొన్న ఫ్రెండ్ ప్లేస్‌లో పరీక్షను పెట్టి చూడు. తను అలాగే చేస్తుంది కదా! పరీక్ష రాసిన ప్రతిసారీ నువ్వు పై తరగతికి వెళ్తున్నావ్. ఎప్పుడైనా ఫెయిల్ అయితే సప్లీ ఉంటుంది కదా! రాసి నెక్స్ట్ లెవెల్‌కి వెళ్తున్నావ్ కదా.. ఫ్రెండ్ కంటే ఏం తక్కువ చేస్తుంది పరీక్ష. మరి దానికెందుకు భయపడుతున్నావ్. ఒక్కసారి ఆలోచించు.. పరీక్షని ఎనిమీలా కాకుండా ఓ బెస్ట్ ఫ్రెండ్‌లా చూస్తే విజయం నీదే. ఈ వారంలోనే ఇంటర్ పరీక్షలు మొదలవుతున్నాయి. పరీక్షలు దగ్గరికొచ్చాయని కంగారొద్దు బంగారు కొండలు. పరీక్ష రూపంలో ఎదురవుతున్న మీ ఫ్రెండ్‌ను మనస్ఫూర్తిగా కలవండి. తలబడి కాదు.. నిలబడి గెలవండి.

# మార్కెట్

## రూ.1.63 లక్షల పైకి బంగారం

### రూ.2 వేల వరకు పెరిగిన తులం ధర
### రూ.25 వేలు అధికమైన కిలో వెండి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: గత కొన్ని రోజులుగా తగ్గిన బంగారం ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో దేశీయంగా ధరలు మూడు శాతం వరకు అధికమయ్యాయి. కిలో వెండి ఏకంగా రూ.2.7 లక్షలకు చేరుకోగా, బంగారం రూ.1.6 లక్షలు పలికింది. ఫలితంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.3,300 లేదా 2 శాతం ఎగబాకి రూ.1,62,800కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.1,59,500గా ఉన్నది. అలాగే కిలో వెండి రూ.8 వేలు లేదా 3.03 శాతం ఎగబాకి రూ.2.72 లక్షలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,070 ఎగబాకి రూ.1,61,350 పలికింది. అలాగే 22 క్యారెట్ ధర రూ.1,900 అందుకొని రూ.1,47,900కి చేరుకున్నది. వెండి రూ.10 వేలు అందుకొని రూ.3 లక్షలకు చేరుకున్నది. ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతోపాటు అమెరికా-ఇరాన్‌ల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణాలని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3 శాతం లేదా 154 డాలర్లు ఎగబాకి 5,235 డాలర్లు పలుకగా, వెండి 6 శాతం లేదా 4.87 డాలర్లు అందుకొని 87 డాలర్లకు చేరుకున్నది.

## స్వల్పంగా లాభపడ్డ స్టాక్ మార్కెట్‌లు..




దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ఆరంభంలో మంచి లాభాలు కనిపించినప్పటికీ.. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు రోజంతా ఒడిదొడుకులకు లోనయ్యాయి. చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 50.15 పాయింట్ల స్వల్ప లాభంతో 82,276.07 వద్ద, నిఫ్టీ 57.85 పాయింట్ల లాభంతో 25,482.50 వద్ద స్థిరపడ్డాయి.

మార్కెట్లలోని అస్థిరతకు అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర భారం మోపింది. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ లాంటి ఐటీ షేర్లతోపాటు టాటా స్టీల్ లాంటి మెటల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్‌లు నష్టాల్లోకి జారుకోకుండా నిలిచాయి.


సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ అత్యధికంగా 2.23 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్‌లు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్ 2.8 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్, టీసీఎస్, ఇండిగో, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు కూడా లాభాలను నమోదుచేశాయి.

ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్‌లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.58 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.96 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ అత్యధికంగా రాణించగా.. నిఫ్టీ ఐటీ, ఫార్మా సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. అయితే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ ఈ సెషన్‌లో అత్యధికంగా నష్టపోయింది.

## 162 లక్షల కోట్లకు..

### అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రిటైల్ రుణాల బకాయిలు

ముంబై : గత ఏడాది అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రిటైల్ రుణాల బకాయిలు 18.1 శాతం పెరిగి రూ.162 లక్షల కోట్లకు చేరుకున్నాయి. బంగారం ధరలు పెరిగిన నేపథ్యంలో గోల్డ్ లోన్లకు ఏర్పడిన గిరాకీ, పండుగల సీజన్, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) హేతుబద్ధీకరణ ఇందుకు కారణమని క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ (సీఐసీ) క్రిఫ్ హై మార్క్ మంగళవారం విడుదల చేసిన గణాంకాలు చెప్తున్నాయి. కాగా, ఈ రిటైల్ రుణాల బకాయిల్లో గత త్రైమాసికం గృహ రుణాల వాటా అత్యధికంగా 10.50 శాతం ఎగిసింది. రూ.43 లక్షల కోట్లను తాకినట్టు సీఐసీ తెలిపింది. అలాగే గోల్డ్ లోన్ల బకాయిలు 44.1 శాతం వృద్ధితో రూ.16.2 లక్షల కోట్లకు, వ్యక్తిగత రుణాల బకాయిలు 11.6 శాతం పెరుగుదలతో రూ.15.90 లక్షల కోట్లకు చేరాయి. తగ్గిన జీఎస్టీ రేట్లు.. కార్లు, ద్విచక్ర వాహనాలు, కన్స్యూమర్ డ్యూరబుల్ లోన్లలో ఏడాది క్రితంతో పోల్చితే వరుసగా 14.60 శాతం, 12.30 శాతం, 14.30 శాతం చొప్పున వృద్ధికి దోహదం చేశాయి.



# సరస్వతి పవర్ వివాదం 'విజయమ్మకు వాటాల బదిలీ చట్టబద్ధమే'


**జగన్, విజయమ్మ మధ్య కుదిరిన అవగాహన మేరకే వాటాల బదిలీలు జరిగాయని వెల్లడి**

**అభ్యంతరం చెబుతూ జగన్, భారతి ఎలాంటి లిఖితపూర్వక సమాచారం ఇవ్వలేదన్న సంస్థ**



సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌కు చెందిన వాటాలను విజయమ్మ పేరుతో బదలాయించిన చాలా కాలం తర్వాత ఈడీ ఆస్తుల్ని జప్తు చేసిందని, ఆ సంస్థ ఎన్‌సీఎల్‌ఏటీకి నివేదించింది. విజయమ్మ పేరుతో వాటాల బదిలీకి ముందు ఎలాంటి దశలోనూ అందుకు అనుమతించొద్దని వైఎస్ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీలు కంపెనీకి లిఖితపూర్వక సమాచారమివ్వలేదని పేర్కొంది. వైఎస్ జగన్, విజయమ్మ మధ్య కుదిరిన అవగాహన మేరకే ఆమెకు వాటాల బదిలీ జరిగి హక్కులు సంక్రమించాయని తెలియజేసింది. విజయమ్మకు వాటాల బదిలీకి సంబంధించి చట్టబద్ధమైన పత్రాలున్నాయన్నది నిర్వివాద వాస్తవమని, వాటాల బదిలీకి ఎలాంటి అడ్డంకులూ లేవని స్పష్టం చేసింది. ఆ తీర్పు చట్టవిరుద్ధం: విజయమ్మ, చాగరి జనార్దన్‌రెడ్డిల పేరుతో వాటాలను బదలాయిస్తూ సరస్వతి పవర్ బోర్డు తీర్మానించడం, దాని ప్రకారం రిజిస్టర్‌లో సభ్యుల పేర్లను మార్చడాన్ని సవాల్ చేస్తూ జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీలు హైదరాబాద్ ఎన్‌సీఎల్‌ఏటీలో గతంలో పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన ఎన్‌సీఎల్‌ఏటీ, వాటాల బదలాయింపును రద్దు చేస్తూ జగన్, భారతి, క్లాసిక్‌రియాల్టీల పేర్లను పునరుద్ధరించాలంటూ గతేడాది జులై 29న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు చట్టవిరుద్ధమని, దాని అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులివ్వాలంటూ చెన్నై ఎన్‌సీఎల్‌ఏటీలో సరస్వతి పవర్ లిమిటెడ్, విజయమ్మ వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. ఈ అప్పీళ్లలో వైఎస్ జగన్ తదితరులు కౌంటర్ వేస్తూ పలు ఆరోపణలు చేశారు. వాటిని తిప్పికొడుతూ ఇటీవల సరస్వతి పవర్ రిప్లై కౌంటర్ దాఖలు చేసింది. అప్పీల్ వేసే అర్హత కంపెనీకి లేదనడం సరికాదని తేల్చిచెప్పింది. రిజిస్టర్‌లో వాటాల బదిలీ మార్పునకు సంబంధించి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తీసుకున్న తీర్మానాలను, వాటాల బదిలీకి అనుసరించిన విధానాన్ని ఎన్‌సీఎల్‌టీ తప్పుపట్టిందని, అందువల్ల అప్పీల్ వేసే అర్హత కంపెనీకి ఉందని స్పష్టం చేసింది. ఉల్లంఘనలు జరగలేదు : తటస్థ వైఖరితో అప్పీలు వేసే అర్హత లేదని జగన్ తదితరులు తప్పుగా భావిస్తున్నారని, ఒకరి తరఫున వకాల్తా పుచ్చుకోలేదని సరస్వతి పవర్ కంపెనీ కౌంటర్‌లో పేర్కొంది. బోర్డు తీర్మానాలను సవరించాలంటూ ట్రైబ్యునల్ చెప్పడంతోనే అప్పీల్ దాఖలు చేశామని తెలిపింది. వాటాల బదిలీ ఒప్పందం, గిఫ్ట్‌డీడ్ అమలును ఎవరూ విభేదించడం లేదని, కొనుగోలు చేసిన వాటాలకు సొమ్ము చెల్లించలేదనీ చెప్పడం లేదని పేర్కొంది. విజయమ్మ పేరుతో వాటాల బదిలీ ప్రక్రియలో ఉల్లంఘనలేవీ జరగలేదని తెలిపింది. పరోక్షంగా గిఫ్ట్‌డీడ్ షేర్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయాలని కోరడమే జగన్, భారతిరెడ్డిల ఉద్దేశమని పేర్కొంది. వివాదాస్పద వాస్తవాల ఆధారంగా రికార్డులను సవరించాలని కోరరాదని స్పష్టం చేసింది. పార్టీల మధ్య విక్రయ ఒప్పందం, వాటా కొనుగోలు ఒప్పందాలున్నాయని తెలిపింది. ఆ ప్రకారమే సొమ్ము చెల్లించారని వివరించింది. నోటీసు అవసరం లేదు : గిఫ్ట్‌డీడ్‌కు సంబంధించి జగన్, విజయమ్మల మధ్య ఇప్పటికీ ప్రేమ, ఆప్యాయతలు కొనసాగుతున్నాయనడంలో సందేహం లేదని స్పష్టం చేసింది. గిఫ్ట్‌డీడ్, వాటాల కొనుగోలు ఒప్పందాలను ఎవరూ తిరస్కరించనప్పుడు వాటాల బదిలీ అనేది కంపెనీకి, వాటాలు పొందిన వ్యక్తికి మధ్య జరిగే ఒక ప్రక్రియ మాత్రమేనని తెలిపింది. జగన్ తదితరులు కంపెనీ చట్టంలోని సెక్షన్-59 పరిధిలోకి రారని, వారికి ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేసే అర్హత లేదని పేర్కొంది. విజయమ్మ పత్రాలు కనిపించలేదని చెప్పడంతో బోర్డు సమావేశమై నోటరీతో రాతపూర్వక లేఖ పొందాక 2024 జులై 6న వాటాల బదిలీ జరిగిందని స్పష్టం చేసింది. ఆ సమయంలో జగన్ తదితరులకు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదంది. చట్టప్రకారమే రిజిస్టర్‌లో పేర్ల మార్పిడి జరిగిందని, దీన్ని గుర్తించకుండా వివాదాస్పద వాస్తవాల ఆధారంగా హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని సరస్వతి పవర్ సంస్థ కోరింది. 2021 జులై 24న క్లాసిక్ రియాల్టీ నుంచి వాటాల కొనుగోలు ఒప్పందం చేసుకున్నానని సరస్వతి పవర్ లిమిటెడ్ డైరెక్టర్ చాగరి జనార్దన్‌రెడ్డి ఎన్‌సీఎల్‌ఏటీకి సమర్పించిన రిప్లై కౌంటర్‌లో పేర్కొన్నారు. ఇందుకోసం రూ. 16 లక్షల 77వేలు చెల్లించినట్లు తెలిపారు. మొదట అదనపు డైరెక్టర్‌గా నియమితుడైన తాను 2021 సెప్టెంబరు 25న రెగ్యులర్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినట్లు వెల్లడించారు. భద్రత దృష్ట్యా కంపెనీ వాటాలన్నీ ఒకేచోట ఉంచాలన్న ఉద్దేశంతో తాను కొన్న వాటా ధ్రువీకరణ పత్రాలను, బదిలీ పత్రాలను విజయమ్మకు అప్పగించినట్లు వివరించారు. డైరెక్టర్‌గా తనను నియమించినప్పటికీ సభ్యుల రిజిస్టర్‌లో వాటాదారుగా పేరు నమోదు కాలేదని తెలియడంతో, అందుకోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. రిజిస్టర్ సవరణకు వాటా ధ్రువీకరణ పత్రాలు లేవని తేలడంతో నోటరైజ్డ్ లేఖను కంపెనీకి అందజేసినట్లు వివరించారు. ఎన్‌సీఎల్‌టీలో ఉత్తర్వు ఆధారంగా వాటా కొనుగోలు ఒప్పందం కింద చెల్లించిన ప్రతిఫలాన్ని వాపసు ఇస్తున్నట్లు క్లాసిక్ రియాల్టీ సమాచారం పంపిందనీ, ఇది సివిల్ కోర్టు ప్రక్రియను తప్పించుకోవడానికి చేస్తున్న ప్రయత్నమని చాగరి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇరుపక్షాల మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయడానికి సెక్షన్-59ని ప్రతివాదులు వాడుకుంటున్నట్లు స్పష్టమవుతోందని కౌంటర్‌లో పేర్కొన్నారు.

## అమెరికా మాపై దాడి చేస్తే, మేం భారత్ పై బాంబులు వేస్తాం



**పాక్ మాజీ రాయబారి**

పాకిస్థాన్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ అమెరికా తమ దేశంపై దాడి చేస్తే, అందుకు ప్రతీకారంగా తాము భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. ఢిల్లీ, ముంబై నగరాలపై బాంబు దాడులకు దిగుతామని ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన... "అమెరికా మాపై దాడి చేస్తే, మేం వెంటనే భారత్‌పై దాడి చేయాలి. ముంబై, ఢిల్లీలను వదిలిపెట్టం. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం" అని పేర్కొన్నారు. తమ దేశ అణు సంపదను లక్ష్యంగా చేసుకున్నా ఇదే తరహా ప్రతిస్పందన ఉంటుందని అన్నారు. అయితే, ఇది దాదాపు అసాధ్యమైన సందర్భమని అంగీకరిస్తూనే, దీనిని 'వ్యూహాత్మక ఉన్మాదం'గా అభివర్ణించడం గమనార్హం. 2014 నుంచి 2017 వరకు భారత్‌లో పాకిస్థాన్ హైకమిషనర్‌గా పనిచేసిన బాసిత్ నుంచి ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు రావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు ఎదుర్కొంటోంది. ఈ సమయంలో భారత్‌ను అనవసరంగా వివాదంలోకి లాగుతూ బాసిత్ మాట్లాడటంపై సోషల్ మీడియాలో భారతీయులు తీవ్రంగా మండిపడుతున్నారు. పాక్ అధికారులకు తమ సమస్యలను పక్కనపెట్టి భారత్‌ను బెదిరించడం అలవాటుగా మారిందని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి స్పందన రాలేదు.

## 25 ఏళ్లుగా అధికారంలో ప్రభుత్వాధినేతగా ప్రధాని మోదీ సరికొత్త రికార్డు



ప్రధాని నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో ఓ చారిత్రక మైలురాయిని అందుకున్నారు. ఎన్నికైన ప్రభుత్వానికి అత్యధిక కాలం అధినేతగా పనిచేసిన వ్యక్తిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ప్రజా జీవితంలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఆయన 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. పవన్ కుమార్ చామ్లింగ్ సిక్కిం సీఎంగా 8,930 రోజులు పదవిలో కొనసాగగా, నరేంద్ర మోదీ ఆ రికార్డును దాటి 8,931 రోజులు పూర్తి చేసుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా ఆయన పనిచేసిన కాలాన్ని కలిపి ఈ ఘనత సాధించారు. ఈ అరుదైన మైలురాయి ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సీఎంగా, పీఎంగా అత్యధిక కాలంనరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. 2014 మే 21 వరకు, దాదాపు 13 ఏళ్లకు పైగా ఆ పదవిలో కొనసాగి, గుజరాత్‌కు అత్యధిక కాలం పనిచేసిన సీఎంగా నిలిచారు. అనంతరం 2014 మే 26న 14వ భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించి ప్రధాని అయిన తొలి వ్యక్తిగా, వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నేతగా ఆయనకు పలు రికార్డులు ఉన్నాయి. పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తిచేసి మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా ఆయన ఘనత సాధించారు. సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లురాజకీయ రికార్డులతో పాటు, డిజిటల్ ప్రపంచంలోనూ మోదీ తనదైన ముద్ర వేస్తున్నారు. ఈ ఏడాది ఆయన సోషల్ మీడియాలోనూ పలు మైలురాళ్లను దాటారు. ఇటీవలే తన యూట్యూబ్ ఛానెల్‌లో 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుని, ప్రపంచ నేతల్లో అగ్రస్థానంలో నిలిచారు. గత ఫిబ్రవరిలో ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి ప్రపంచ నేతగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆయనకు ఇన్‌స్టాలో 10.1 కోట్ల మంది, ఎక్స్ (ట్విట్టర్) లో 10.64 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి బ్యాంకు ఏటీఎమ్, యూపీఐ వాడకంలో కీలక మార్పులు!






ఏప్రిల్ 1వ తేదీ నుంచి పలు బ్యాంకులు తమ నిబంధనల్లో కీలక మార్పులు తీసుకువస్తున్నాయి. ముఖ్యంగా ఏటీఎమ్ నగదు ఉపసంహరణ, యూపీఐ లావాదేవీలకు సంబంధించి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వంటివి తమ కస్టమర్ల కోసం కొత్త మార్గదర్శకాలను ప్రకటించాయి. ఈ మార్పుల గురించి వినియోగదారులు ముందే తెలుసుకోవడం ద్వారా అనవసర చార్జీలను నివారించుకోవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ఏటీఎమ్ లావాదేవీల లెక్కింపు విధానంలో మార్పు చేసింది. ఇప్పటివరకు డెబిట్ కార్డు ద్వారా ఏటీఎమ్‌లో తీసిన నగదును మాత్రమే ఉచిత లావాదేవీల పరిమితిలో లెక్కించేవారు. కానీ ఏప్రిల్ 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చేసే నగదు ఉపసంహరణలను కూడా ఈ కోటాలోనే పరిగణిస్తారు. హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎమ్‌లలో నెలకు 5 సార్లు, ఇతర బ్యాంకుల ఏటీఎమ్‌లలో (మెట్రోలలో 3, నాన్-మెట్రోలలో 5) ఉచితంగా నగదు తీసుకోవచ్చు. ఈ పరిమితి దాటితే ప్రతి లావాదేవీకి రూ.23తో పాటు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కొన్ని డెబిట్ కార్డులపై రోజువారీ నగదు ఉపసంహరణ పరిమితిని తగ్గించింది. రిస్క్ మేనేజ్ మెంట్, కార్డుల వినియోగం తీరు తెన్నుల్లో ఏకీకృత విధానం కోసం ఈ మార్పులు చేసినట్లు సమాచారం. తాజా రూల్స్ ప్రకారం.. పీఎన్‌బీ కస్టమర్లు తమ డెబిట్ కార్డు రకాన్ని బట్టి రోజుకు గరిష్ఠంగా రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకూ నగదును తీసుకోవచ్చు. గతంలో 1 లక్షల వరకూ నగదు ఉపసంహరణకు అనుమతి ఉన్న కార్డుల పరిమితిలో కూడా కోత పడింది. ఇక జియో పేమెంట్స్ బ్యాంక్ తన కస్టమర్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వద్ద నగదు తీసుకునే కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అలాగే, ఏప్రిల్ 1 నుంచి రూపే ప్లాటినం డెబిట్ కార్డులపై ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ పొందాలంటే, వినియోగదారులు నిర్దేశిత మొత్తంలో ఖర్చు చేయాలనే కొత్త నిబంధనను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పీసీఐ) తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో, కస్టమర్లు తమ బ్యాంకుల తాజా నిబంధనలను తెలుసుకొని తదనుగుణంగా వ్యవహరించడం మంచిది.

## ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ ఏపీకే ఫైల్స్‌పై ఏపీ డీజీపీ తీవ్ర హెచ్చరిక



యాండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. ముఖ్యంగా 'ఏపీకే ఫైళ్ల' రూపంలో వస్తున్న కొత్త తరహా సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని కోరుతూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని డీజీపీ తెలిపారు. 'గ్యాస్ కనెక్షన్ రీ-కేవైసీ చేయాలని, ప్రభుత్వ పథకాలకు అర్హులయ్యారని నమ్మించి ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయిస్తారు. ఆ తర్వాత మీ వ్యక్తిగత, బ్యాంకు వివరాలు సేకరించి ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకుంటారు. వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మొత్తం కాజేస్తారు' అని ఆయన వివరించారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లో వచ్చే ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. ఒకసారి ఈ ఫైల్స్ ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్‌లోని ఎస్ఎంఎస్‌లు, కాంటాక్టులు, పాస్‌వర్డ్‌లు నేరగాళ్ల చేతికి చిక్కుతాయన్నారు. పొరపాటున ఎవరైనా ఇలాంటి మాల్వేర్ ఇన్‌స్టాల్ చేస్తే వెంటనే ఫోన్‌ను రీబూట్ చేయాలని సూచించారు. అలాగే, ఫోన్ సెట్టింగ్స్‌లో 'ఇన్‌స్టాల్ ఫ్రమ్ అన్నోన్ సోర్సెస్' ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవడం సురక్షితమని తెలిపారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఎవరైనా వీడియో కాల్ చేసి బెదిరిస్తే భయపడవద్దని, మన దేశ చట్టాల్లో అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. ఎవరైనా మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఇరాన్‌పై జీ7 దేశాల కన్నెర్ర


**అణ్వాయుధాలు సమకూర్చుకోవద్దని వార్నింగ్**

మధ్యప్రాచ్యంలోని పలు దేశాల్లో పౌరులు, కీలక మౌలిక సదుపాయాలపై ఇరాన్ చేస్తున్న దాడులను జీ7 దేశాల కూటమి తీవ్రంగా ఖండించింది. ఇరాన్, దాని అనుబంధ వర్గాలు చేస్తున్న ఈ



అన్యాయమైన దాడులను ఎదుర్కొంటున్న ప్రాంతీయ భాగస్వామ్య దేశాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, అమెరికా దేశాల విదేశాంగ మంత్రులతో పాటు యూరోపియన్ యూనియన్ ఉన్నత ప్రతినిధి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, జోర్డాన్, ఇరాక్‌లలో పౌరులు, ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యపూరిత దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని జీ7 కూటమి స్పష్టం చేసింది. ఇరాన్ చర్యలు కేవలం లక్షిత దేశాలకే కాకుండా, ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు కూడా పెను ముప్పుగా పరిణమిస్తున్నాయని హెచ్చరించింది. ఇలాంటి దాడులన్నింటినీ తక్షణమే, బేషరతుగా నిలిపివేయాలని డిమాండ్ చేసింది. హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల భద్రత, ప్రపంచ సరఫరా వ్యవస్థల పరిరక్షణ చాలా ముఖ్యమని జీ7 దేశాలు నొక్కి చెప్పాయి. ఇరాన్ లేదా దాని అనుబంధ వర్గాల దాడులను ఎదుర్కొంటున్న దేశాలకు తమ భూభాగాలను, పౌరులను రక్షించుకునే హక్కు ఉందని, వారి భద్రత, సార్వభౌమత్వానికి తమ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చాయి. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని పొందకూడదని పునరుద్ఘాటించిన జీ7 కూటమి.. తన బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని, ప్రాంతంలో అస్థిరత సృష్టించే కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాలని పిలుపునిచ్చింది.

## ఇజ్రాయెల్ అణు కేంద్రంపై ఇరాన్ భీకర దాడి



పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు తీవ్రస్థాయికి చేరాయి. ఇజ్రాయెల్‌లోని కీలకమైన డిమోనా అణు పరిశోధన కేంద్రమే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడికి పాల్పడింది. తమపై గతంలో జరిగిన దాడులకు ప్రతీకారంగానే ఈ చర్య చేపట్టినట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దాడుల ధాటికి డిమోనా, ఆరాద్ పట్టణాల్లో 100 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఛేదించుకుని ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు అణు కేంద్రం సమీపంలో పడటంతో ఆ ప్రాంతంలో భారీ పేలుళ్లు సంభవించాయి. అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది మరింత విధ్వంసానికి దారితీయవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామంతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన భద్రతా కేబినెట్‌తో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని ప్రధాన చమురు, అణు కేంద్రాలపై ప్రతిదాడికి ఇజ్రాయెల్ వైమానిక దళం సిద్ధమవుతున్నట్లు అల్ జజీరా, రాయిటర్స్ వంటి అంతర్జాతీయ వార్తా సంస్థలు నివేదించాయి. ఈ దాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## డాక్టర్ వందన హత్య కేసు.. టీచర్‌కు జీవిత ఖైదు



కేరళలో సంచలనం సృష్టించిన యువ వైద్యురాలు వందన దాస్ హత్య కేసులో కొల్లం అడిషనల్ సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌ను అతి కిరాతకంగా హతమార్చిన స్కూల్ టీచర్ జి. సందీప్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. జీవితాంతం అతడు జైలులోనే గడపాలని స్పష్టం చేసింది. హత్య నేరానికి ఈ శిక్షతో పాటు, ఇతర నేరాలకు అదనంగా 30 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆదేశించారు. 2023 మే 10న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ గొడవలో గాయపడిన సందీప్‌ను పోలీసులు వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకురాగా, అక్కడే సర్జికల్ కత్తెరతో డాక్టర్ వందనపై దాడి చేసి 27 సార్లు పొడిచి చంపాడు. నిందితుడు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు నాటకమాడినప్పటికీ, పక్కా ప్రణాళికతోనే ఈ హత్య జరిగిందని కోర్టు నిర్ధారించింది. అయితే, ఈ తీర్పుపై బాధితురాలి కుటుంబం, ప్రాసిక్యూషన్ అసంతృప్తి వ్యక్తం చేశాయి. నిందితుడికి మరణశిక్ష విధించాలని కోరుతూ కేరళ హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించాయి. ఇది "అత్యంత అరుదైన కేసు" కిందకు వస్తుందని, కాబట్టి ఉరిశిక్షే సరైనదని వారు వాదిస్తున్నారు.






## అరెరే.. అరెరే.. హృద్యంగా ఉంది

సింగర్, నటి దియా అందించిన 'అరెరే.. అరెరే..' మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల కార్యక్రమం హైదరాబాద్లో జరిగింది. బటర్ఫ్లై మ్యూజిక్ బ్యాన్డ్ రూపొందిన ఈ మ్యూజిక్ వీడియో విడుదల కార్యక్రమానికి తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, హీరో పూరి ఆకాశ్, సినీ ప్రముఖులు సమీర్, సాగర్, ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె, నటుడు, మిమిక్రి శివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ.. దియా ఒక వండర్ఫుల్ టాలెంట్. ఈ అరెరే.. అరెరే.. మ్యూజిక్ ఆల్బమ్ చాలా హృద్యంగా ఉంది. ఆమె గాత్రం, నటన రెండింట్లోనూ ప్రతిభ స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి కొత్త ప్రతిభలు ముందుకు రావడం తెలుగు సంగీత రంగానికి మంచి సంకేతం. ఈ ఆల్బమ్ పెద్ద విజయం సాధిం చాలని ఆశిస్తున్నాను అన్నారు. నటి, సింగర్ దియా మాట్లాడుతూ& ఈ ఆల్బమ్ రూపుదిద్దుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృద యపూర్వక కృతజ్ఞతలు. నా మీద నమ్మకం ఉంచి ఈ ప్రాజెక్ట్ను విజయవంతంగా పూర్తి చేసిన టీమ్ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. కార్యక్రమానికి విచ్చేసి ఆశీర్వదించిన గౌరవనీయ అతిథులందరికీ నేను రుణపడి ఉంటాను. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణే నాకు పెద్ద బలం అని అన్నారు. నిర్మాత నూతన్ చెకురి మాట్లాడుతూ& ఎప్పటి నుంచో ఒక మంచి మ్యూజిక్ ఆల్బమ్ చేయాలన్న దియా కోరిక 'అరెరే.. అరెరే..' ద్వారా నెరవేరింది. ఆమె ప్రతిభపై నాకు ఉన్న నమ్మకం ఈ ప్రాజెక్ట్ ద్వారా మరింత బలపడింది.

## కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు!




'శంబాల' బ్లాక్ బస్టర్ తర్వాత దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మరో ఆసక్తికర చిత్రంతో రాబోతున్నారు. హీరో సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని చేయబోతున్నట్టు వారు శనివారం ప్రకటించారు. ఈ మేరకు కాన్సెప్ట్ పోస్టర్‌ను సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఈ పోస్టర్‌లో యుద్ధభూమి బ్యాక్‌గ్రౌండ్‌లో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ అలా నిటారుగా నిల్చుని ఉంది. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అంటూ ఈ పోస్టర్‌కు ఇచ్చిన క్యాప్షన్ ఈ ప్రాజెక్టుపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. విభిన్న భాషా, సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన ప్రేక్షకులే లక్ష్యంగా ఈ చిత్రాన్ని పాన్-ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. షైనింగ్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ-ప్రొడక్షన్ ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది.

## బావామరదళ్ల గిల్లికజ్జాలు

కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై కోన వెంకట్ రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీశ్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు కావ్య, శ్రావ్య నిర్మాతలు. ఇందులో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. మార్చి 26న రిలీజ్ కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి శనివారం విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించినట్టు తెలుస్తోంది. హీరో హీరోయిన్ మధ్య ఉండే ప్రేమ, గిల్లికజ్జాలను హత్తుకునేలా రూపొందించారు. హీరో హర్ష్ రోషన్ తన మరదలైన హీరోయిన్ ప్రేమను గెలవటానికి ఏం చే శాడు? తనకు ఎదురైన సవాళ్లేంటి? వాటిని ఎలా అధిగమించాడు? అనే అంశాలతో ఈ సినిమా రూపొందినట్లు తెలుస్తోంది.





## ఆదిత్య ధర్ నీకు సెల్యూట్: కంగనా

చిత్రపరిశ్రమలోకి రావాలనే ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఆదిత్యధర్ అంటూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించింది ప్రముఖ కథానాయిక కంగనా. 'ధురంధర్ ది రివెంజ్' చిత్రాన్ని దర్శకుడు ఆదిత్యధర్ తీర్చిదిద్దిన తీరుకి ఆమెకు ఎంతగానో నచ్చిందంటూ ఇన్‌స్టా స్టోరీలో తన అభిప్రాయాల్ని పంచుకుంది. "ధురంధర్' విజయంలో గొప్ప విషయం ఏమిటంటే ఆదిత్య ధర్ ఒక సూపర్ స్టార్ దర్శకుడిగా మంచి పేరు సంపాదించుకున్నారు. హాలీవుడ్ స్టార్ దర్శకులు ఎల్లప్పుడూ నటుల కంటే గొప్పవారు. కానీ, మనం మన చిత్రనిర్మాతలకు ఎప్పుడూ తగినంత గౌరవం, గుర్తింపు ఇవ్వము. వాళ్లు ఎంత కష్టపడినా తక్కువ జీతాలే పొందుతారు. అంతేకాదు సూపర్ స్టార్ల చేత వేధింపులకు కూడా గురవుతారు. దాని ఫలితంగానే ఇండస్ట్రీలో నిర్మాతగానో, సినిమాటోగ్రాఫర్‌గానో మరే ఇతర సాంకేతిక నిపుణుడిగానో కావాలని కలలు కనే ఏ యువకుణ్ని (ఇన్‌సైడర్, అవుట్‌సైడర్) నేను కలవలేదు. ప్రతి ఒక్కరూ తాము ప్రతిభావంతులమని చెప్పుకుంటారు. కానీ, వారు కేవలం నటులు కావాలని మాత్రమే కోరుకుంటారు. ఇప్పుడు ఇక్కడ హీరోల కన్నా ఎక్కువగా వెలిగిపోతున్న ఒక సూపర్ స్టార్ దర్శకనిర్మాత ఉన్నారు. ఈరోజు ఎంతోమంది యువత ఆయన రూపొందించిన కథను చూస్తున్నారు. వారు ఆయనలా అవ్వాలని ఆకాంక్షించి చిత్రపరిశ్రమను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తారు!! సెల్యూట్ ఆదిత్య ధర్" అని ఆ పోస్ట్‌లో రాసింది కంగనా.

## డెకాయిట్‌తో టాలీవుడ్ ఎంట్రీ!



అడివి శేష్ తొలి సారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్న చిత్రం 'డెకాయిట్'. ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తుండగా, అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ కజిన్ బ్రదర్ కుమార్తె జైన్ మేరీ ఖాన్ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. జైన్ మారీ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఖాకీ యూని ఫామ్‌లో తుపాకీ పట్టుకుని ముందుకు గురిపెట్టిన ఆమె లుక్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ఏప్రిల్ 10న తెలుగు, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో; సినిమాటోగ్రఫీ: ధనుష్

## 'బిచ్చగాడు' కాంబోలో వంద దేవుళ్లు

మల్టీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో వచ్చిన 'బిచ్చగాడు' చిత్రం ఎన్ని రికార్డులను నెలకొల్పిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మళ్లీ



ఇన్నేళ్ల తర్వాత ఈ కాంబోలో 'వంద దేవుళ్లు' అనే చిత్రం రాబోతోంది. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజి నిర్మిస్తున్నారు. ఇందులో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని తదితరులు ముఖ్యపాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ స్టార్ విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు.

## మల్టీస్టారర్‌లో కయాదు లోహార్



టాలీవుడ్ సక్సెస్ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తనదైన మార్క్ ఎంటర్టైన్మెంట్ కోసం మరో భారీ మల్టీస్టారర్ సిద్ధం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోలుగా విక్టరీ వెంకటేష్.. నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్నారు. ఇద్దరు చేతులు కలపడం ఇదే తొలిసారి కావడంతో ఆ కాంబినేషన్ లో సినిమా ఎలా ఉంటుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనీల్ కథతో పాటు ఆ కథలో పాత్ర ధారులపై దృష్టి పెట్టాడు. ఇప్పటికే వెంకటేష్కు జోడీగా అభినేత్రి కీర్తి సురేష్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. కల్యాణ్ రామ్ సరసన ఛాన్స్ అందుకునే నటి ఎవరు? అన్నది ఆసక్తికరంగా మారిన తరుణంలో కయాదు లోహర్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కళ్యాణ్ రామ్ గంభీరమైన పాత్రకు ఈమె పాత్ర చక్కగా సెట్ అవుతుందని అనీల్ బలంగా నమ్ముతున్నాడుట. ప్రస్తుతం కయాదు లోహార్ పేరు చర్చల దశలోనే ఉంది. కానీ ఖరారు అవ్వడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోర్సెస్ ద్వారా తెలిసింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787